PLATINUM JUBILEE YEAR

Visit Internet Edition @ www.jaminryot.com

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు

వ్యవస్థాపక సంపాదకుడు: నెల్లూరు శ్రీరామమూర్తి

# జమీన్‌రైతు

సంపుటి:75 సంచిక:43 15.10.2004 శుక్రవారం 12పేజీలు విడిప్రతి : రూ.3.00

డి.ఆర్. ఉత్తమలో విందుల పసందు

- బర్త్‌డే పార్టీలు, ఎంగేజ్‌మెంట్ ఫంక్షన్లు, వివాహాలు తదితర శుభకార్యాలకు, కార్పొరేట్ మీటింగులు, సెమినార్లు, గెట్ టుగెదర్లు మరియు కాన్ఫరెన్స్‌లకు అత్యాధునిక వసతులతో, అన్ని హంగులతో బేంక్వేట్ హాల్స్ (అన్ని రకముల ఎలక్ట్రానిక్ - సౌండ్, మ్యూజిక్, వీడియో పరికరములతో సహా)
- ప్రతి రోజూ వివిధ రకాల వెజ్ & నాన్‌వెజ్ స్పెషల్ బఫే లంచ్ రూ. 160/-లకే

మరిన్ని వసతులతో మీకు స్వాగతం పలికే

మీ డి.ఆర్. ఉత్తమ ☆ ☆ ☆ హోటల్

DR UTTHAMA HOTEL

23/976, Dhandayudha Puram, Nellore - 3. Phones : 2317777 - 10 Lines

# ఎవర్ని మోసం చేయను ఈ చర్చలు?

నక్సల్స్‌తో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన చారిత్రాత్మక చర్చల ఘట్టానికి నేడు ఆవిష్కరణ జరగబోతున్నది. ఈ వార్త వ్రాసే సమయానికి ఇరు పక్షాలు తమ ఎత్తుగడలు, వ్యూహాలు, అజెండాలు మనసులో పెట్టుకుని, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థకు చేరుకుని వున్నారు. ఇక చర్చలు మొదలు కావడమే తరువాయి.

చేయవని; తమ ఉద్యమాన్ని బలోపేతం చేసుకోవడానికి, గెరిల్లా సైన్య నిర్మాణానికి, తమ కార్యకర్తలకు కొంతకాలం విశ్రాంతినివ్వడానికి, తమ ఉద్యమ భావాలను ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేసుకోవడానికి, వనరులు సమకూర్చుకోవడానికి ఇదొక వెసలుబాటు అనే ధోరణిలోనే వారు చర్చలకు సిద్ధమయ్యారనేది స్పష్టం. ఈ విషయంలో నక్సల్ నేతలు,

సాయుధ పోరాటం వదలము అని చెప్పిన తర్వాత ఇక ఆ సంస్థతో చర్చల ప్రస్తావనే ఉదయించకూడదు. కానీ ప్రభుత్వం మాత్రం దాన్ని పట్టించుకోకుండా ముందుకు పోతున్నది. ముందు ఎన్ని మాట్లాడినా చర్చల సమయంలో తాము ఆయుధాలు వదిలెయ్యండి, విప్లవం సాధ్యం కాదు, తుపాకి గొట్టం ద్వారా రాజ్యాధికారం సిద్ధించదు అని హితవచనాలు పలికితే నక్సలైట్లు చెవిలో పువ్వు పెట్టుకుని మరీ వింటారన్న భ్రమ ఏదో వున్నట్లుంది ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డికి. నెల్సన్ మండేలా ఉదాహరణ చూపి వారికి నచ్చ చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు. ఎంత అవివేకమైన పిల్ల చేష్ట ఇది? నక్సల్‌బరీ ఉద్యమకారులు రాజశేఖరరెడ్డి దగ్గర విప్లవ పాఠాలు నేర్చుకోవలసిన దుస్థితిలో వున్నారా?

ఆయన తలపెట్టిన ఈ చర్చల ప్రహసనం ఇటువంటి అపభ్రంశపు అంచనాలతో, అవివేకపు ఆలోచనలతో జరిగి

అయితే ఈ చర్చలు ఎందుకోసం? ఎవరి కోసం అన్నది ప్రశ్న. సాధారణ ప్రజానీకానికే కాదు, తలలు పండిన రాజకీయ పరిశీలకులకు కూడా అంతు చిక్కని ప్రశ్న ఇది. ఎన్నికల ప్రణాళికలో ప్రతిపాదించాము కాబట్టి, చర్చిస్తున్నాము అన్నది ప్రభుత్వ వాదన. అయితే చర్చల లక్ష్యం ఏమిటి, గమ్యం ఏమిటి, తీరు ఎట్లా వుండాలి అన్న విషయంలో ప్రభుత్వానికి స్పష్టత లేదన్న మాట మాత్రం నూటికి నూరు పాళ్లు నిజం. ఈ రోజు ఉద్యమ చర్చా వేదికకు వెళ్లే వరకు కూడా ప్రభుత్వ ప్రతినిధుల దగ్గర ఒక అజెండా అంటూ లేదు. నక్సల్స్ ప్రతిపాదించిన అజెండాపై తాము ఎట్లా స్పందించాలో కూడా స్పష్టత లేదు. అయోమయ మానసంతో, ఖాళీ మెదళ్లతో చర్చలకు వెళ్తున్నారు వారు. నక్సల్స్‌కు మాత్రం పూర్తి స్పష్టత వుంది. ఈ చర్చలు తమ సాయుధ పోరాటపంథాను, ఆయుధ ధారణను, ప్రాంతాల వారీగా రాజకీయ అధికారం సాధించాలను ...కాలు, విప్లవ

వారి ప్రతినిధులు చాలా తెలివిగా, సమయోచితంగా వ్యవహరించారు. చర్చలు అన్న ప్రస్తావన రాగానే, రాజ్యాంగాన్ని విశ్వసించని సంస్థలతో, రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు చర్చలు జరపడం ఏమిటి అన్న విమర్శ తలెత్తింది. తమ వ్యూహానికి అదొక ప్రతిబంధకంగా మారకుండా, రాజ్యాంగంలోని ప్రతి అక్షరం అమలు చేసే షరతుపై రాజ్యాంగాన్ని తిరస్కరించకుండా చర్చలకు తాము సిద్ధమని ప్రకటించారు వారు. ప్రభుత్వాన్ని చక్రబంధంలో ఇరికించిన వాదన ఇది. వారి అజెండా కూడా ఎంతో రాజకీయ పరిణతితో రూపొందించింది. భూమి, భుక్తి, విముక్తి అనే త్రిసూత్ర ప్రాతిపదికన పలు చర్చనీయాంశాలు ప్రతిపాదించారు వారు. అయితే ప్రతి దశలోనూ, ప్రతి సందర్భంలోనూ, ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని తమ సాయుధ పోరాట పంథాను, ఆయుధ ప్రయోగాన్ని నొక్కి చెప్తూ వస్తున్నారు. తమ అంతిమ గమ్యం అదేనని చెటతెల్లం

వుంటే మాత్రం అంతకంటే దారుణమైన విషయం వేరొకటి వుండదు. భూసంస్కరణలు, గుట్కా నిషేధం, రాజకీయ ఖైదీల విడుదల, కేసుల ఉపసంహరణ, తెలంగాణా రాష్ట్రం, అవినీతి కుంభకోణాలు, నల్లదండు ముఠాల నియంత్రణ, ప్రజా సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి, భూస్వామ్య సంస్కృతి, ప్రజాస్వామిక హక్కులు, ప్రపంచ బ్యాంకు

వంటి అంశాలు చర్చలలో ప్రస్తావించబోతున్నారు నక్సలైట్లు. ఇవన్నీ ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు ప్రయత్నాలే తప్ప, విప్లవ ఉద్యమానికి ప్రత్యామ్నాయం కాదని; ఇవి నెరవేరినంత మాత్రాన తమ సాయుధ పోరాటం నిలపబోమని; అంతిమంగా ప్రాంతాల వారీ రాజ్యాధికారం చేజిక్కించుకునే వరకు తమ పోరాటం కొనసాగుతూనే వుంటుందని రామకృష్ణ ప్రకటించాడు. చర్చలు ఫలించినా, విఫలమైనా తమ ఉద్యమం మీద ఎటువంటి ప్రభావం వుండబోదని తేల్చి చెప్పాడు. అటువంటప్పుడు ఇక ఈ చర్చల ఆంతర్యం ఏమిటి? ఎవరు ఎవరిని మోసం చేయడానికి ఈ కుస్తీ పడుతున్నారు? ప్రజల జీవితాలపై దీని ప్రభావం ఏ రూపంలో, ఎంత వరకు వుంటుంది? ఇవన్నీ సమాధానం దొరకని ప్రశ్నలు. ఈ మాత్రం ఆత్మ పరిశీలన, విచక్షణ కూడా లేకుండా ప్రభుత్వం చర్చలకు సిద్ధపడి, ...

అపకారం చేయబోతుందన్న భయం అందరిలోనూ నెలకొంటున్నది.

ఈ చర్చల వల్ల స్పష్టంగా కన్పిస్తున్న నష్టం - పోలీసు వ్యవస్థ నిర్వీర్యం కావడం. వారి నైతిక స్థైర్యం పూర్తిగా హరించుకు పోయే ప్రమాదం కళ్ల ముందు కదలాడుతున్నది. ఏ నక్సల్స్‌ను అణిచివేయడానికి ఇంతకాలం తమ ప్రాణాలకు తెగించి పోలీసులు అడవులలో పోరాటం

జరిపారో అదే నక్సల్ నేతల బాడీగార్డుల వలె నిలబడవలసి రావడం వారి ఆత్మ గౌరవానికి ఎంత భంగకరమో ప్రభుత్వం ఆలోచించడం లేదు. నక్సల్ ప్రతినిధులు వరవరరావు, కళ్యాణరావు, గద్దర్ వంటి వారు గత మూడు రోజులుగా పోలీసులపై పెట్టిన ఒత్తిడి అంతా ఇంతా కాదు. చీటికి మాటికి వారిపై హోం మంత్రికి ఫిర్యాదు చేయడం; ఆయన వెనుకా ముందు చూడకుండా ఎస్పీ, డిఎస్పీ స్థాయి అధికారులను కూడా మందలించడం చూసే వారికే ఎబ్బెట్టుగా వుంది. కానీ ప్రభుత్వం మాత్రం ఆ కోణాన్ని పట్టించుకోవడం లేదు. పోలీసులు తమ విధి నిర్వహణలో నైతిక స్థైర్యాన్ని కోల్పోతే ప్రజలకు ఎవరు దిక్కు? జగిత్యాల వద్ద నక్సల్ ప్రేరణతో పేదలు 100 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. గోదావరి జిల్లాలో దళితులు భూస్వాముల వద్దకు వెళ్లి, అన్నలు వచ్చి భూమి పంపకం చేసేలోగా మీరే

తరువాయి 7వ పేజీలో

## హోం మంత్రి తలకాయలో వుండేది మెదడా? మట్టి ముద్దా?

మన హోంమంత్రి జానారెడ్డి పని తీరు చూస్తుంటే ఆశ్చర్యం కల్గుతుంది. తానొక హోంమంత్రిని అని; సువిశాల రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడవలసిన బాధ్యత తనపై వుందని; పోలీసు వ్యవస్థ పరువు మర్యాదలు తనపై ఆధారపడి వున్నాయని మర్చిపోతున్నట్లున్నారాయన. నక్సల్స్ నేతలు నల్లమల అడవులలో నుంచి హైదరాబాద్ నగరానికి తరలి వచ్చే సమయంలో వారికి సరైన స్వాగత సత్కారాలు చేయలేదని ఒక డిఎస్పీ మీద, ఒక జిల్లా ఎస్పీ మీదా విరుచుక పడ్డారాయన. నిన్నటి వరకు తలలకు వెల కట్టి వేటాడిన వారికి అదే పోలీసుల చేత శాల్యూట్ చేయించ చూశారాయన. నక్సల్స్ పిలిస్తే వారి సభలకు హాజరు అవుతానని; అడవులకు వెళ్తానని పిచ్చి పిచ్చి ప్రకటనలు చేసి పోలీసు పరువు తీస్తున్నాడు. వీటన్నిటికంటే ఘోరమైనది, నీచమైనది - మోలిన్ మిషన్ చర్చి మోసగాళ్ల పట్ల ఆయన ప్రవర్తన. కేంద్రమంత్రి పనబాక లక్ష్మిని అడ్డం పెట్టుకుని నెల్లూరు జిల్లా పరిసరాలలో ఈ చర్చి దగాకోరులు చేసిన దగుల్బాజీ పనులు తెలిసినవే. వీటిపై జమీన్‌రైతులో నిశిత విమర్శలు వచ్చిన తర్వాత లక్ష్మి గారు

తరువాయి 7వ పేజీలో

## ముఖ్యమంత్రికి కేంద్రం హెచ్చరిక?

నక్సల్స్‌తో చర్చల విషయంలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డికి హెచ్చరిక వంటి సందేశం ఒకటి పంపినట్లు విశ్వసనీయంగా తెలుస్తున్నది. నక్సల్స్‌తో చర్చలు జరపడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతి బాగాలేదని; పిల్చి మాట్లాడితే సరిపోయే దానికి వారిని ప్రభుత్వం అతిథులుగా పరిగణించి రాజ మర్యాదలు చేయడం; ప్రతిరోజూ ప్రసార సాధనాలలో విపరీత ప్రచారం కల్పించడం; వారి మెహర్బానీ కోసం పోలీసు అధికారులను మందలించడం వంటి చర్యలు ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇస్తాయని హోంమంత్రిత్వ శాఖ అభిప్రాయపడిందట. పైగా నక్సల్స్‌తో చర్చలను ఒక దీర్ఘ కాల వ్యూహంగా భావించి; వారు హైదరాబాద్‌కు వచ్చి చర్చలు జరిపి అడవులకు వెళ్లడం; మళ్లీ ఇదే ప్రచార హోరుతో తిరిగి రావడం వంటి చర్యలు దేశ భద్రతకే ముప్పుగా పరిణమిస్తాయని; వారిని ఇప్పటికే చర్చలకు పిలిచారు కాబట్టి - ఒకే ఒక విడతలో చర్చలు ముగించడం మంచిదని; దీనిని పలు దఫాలుగా జరిపించాలన్న ఆలోచన మానుకోవా...

## జీతాల మీద నక్సల్ సైనికులు

పీపుల్స్‌వార్ నక్సలైట్లు ఆంధ్ర రాష్ట్రంలో గెరిల్లా పోరాటం జరపడానికి జీతాల మీద సైనికుల నియామకం చేస్తున్నారని ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రభుత్వానికి నివేదించాయి. మహబూబ్‌నగర్ వంటి కరువు జిల్లాలలో; విశాఖ ఏజన్సీ ప్రాంతాలలో, ఒరిస్సా గ్రామాలలో నిరుపేదరికంతో సతమతమయ్యే కుటుంబాల నుంచి పదిహేను, ఇరవై ఏళ్ల మధ్య వయస్సు కల్గిన యువతీ, యువకులను ఇందుకోసం ఎంపిక చేసుకుంటున్నారట. నెలకు వెయ్యి నుంచి పదిహేను వందల రూపాయల జీతం ఇచ్చేటట్లు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని వినికిడి. ఎడతెరగని కరువు, ఆకలి మంటలతో అల్లాడే ఈ కుటుంబాలకు వెయ్యి రూపాయల జీతం పెద్ద మొత్తం క్రిందే లెక్క. తమ భోజనం ఎటూ దళంలోనే గడిచి పోతుంది కాబట్టి, తమ జీతంతో తమ తల్లితండ్రులు రెండు పూటలా తిండి తినే అవకాశం లభిస్తుందని ఈ ఉద్యోగాల కోసం ఎగబడుతున్నారని; మహిళల్లో దీనికి స్పందన మరింత జాస్తిగా వుందని ఇంటెలిజెన్స్ వర్గాలు చెప్తున్నాయి. ఇటీవలి కాలంలో పీపుల్స్‌వార్‌కు హార్డ్‌కోర్ మిలిటెంట్ కేడర్ సంఖ్య తగ్గిపోయింది. పోలీసు ఎన్‌కౌంటర్లు, అణిచివేత చర్యల ఫలితంగా కొత్త వారు రావడం లేదు. కేవలం సిద్ధాంత ప్రాతిపదిక మీద, కమ్యూనిస్టు భావజాలంతో కొత్త వారిని ఆకర్షించడం కష్టంగా భావించిన పీపుల్స్‌వార్ నేతలు ఈ మార్గం అనుసరిస్తూ

తరువాయి 7వ పేజీలో

# విప్లవం సాధ్యమని వెర్రిగా నమ్మే పది మంది కోసం నూరుకోట్ల భారత ప్రజలు నరకం చవి చూడాలా?

**సణుగుడు**
**డోలేంద్ర**

మా అంతిమ లక్ష్యం ప్రాంతాల వారిగా రాజ్యాధికారం; అందుకు మార్గం సాయుధ పోరాటం; నూతన ప్రజాస్వామిక విప్లవ విజయంతో ఏర్పడే ప్రజా ప్రభుత్వ స్థాపన కోసం మేము కృషి చేస్తాము. ముందుగా పల్లెల్లో పట్టు సాధిస్తాము; ఆ తర్వాత పల్లెల మీదుగా




కోకాకోలా కంపెనీని నిషేధించాలని ఉద్యమం చేసే అన్నలు అదే కంపెనీ నీళ్ల తప్ప వేరేమీ త్రాగలేక పోవడం న్యాయమా?

ఒక్కసారిగా పట్టణాలను చుట్టుముట్టి వశం చేసుకుంటాము; భూస్వాముల బందీఖానాలో వున్న భూమిని ప్రజా పరం చేసి, ప్రజా జీవితంలో సమూల మార్పులు తేగల వ్యవసాయ విప్లవం సాధిస్తాం - చర్చలకు వచ్చిన నక్సల్ నేతలు చేసిన ప్రకటనల సారాంశం ఇది. కమ్యూనిస్టు సిద్ధాంత ప్రాతిపదిక మీద, సామ్యవాద సమ సమాజ పునాదుల మీద నూతన ప్రపంచాన్ని సృష్టించాలని నూరేళ్ల క్రితం కారల్‌మార్క్స్ కన్న కలలు వారి కళ్లలో స్థిర నివాసం ఏర్పరచుకుని వున్నాయి. ఈ 21వ శతాబ్దంలో, ఈ భారతదేశంలో కూడా అది సాధ్యం అన్న ఆత్మవిశ్వాసం వారిలో తొణికిసలాడుతున్నది.

37 సంవత్సరాల అవిశ్రాంత పోరాటం తర్వాత, వేలాది మంది మెరికల వంటి యోధులు బలైపోయిన తర్వాత కూడా తమ ఉద్యమం వక్రీకరణకు గురికావడం, మధ్య తరగతి దృష్టిలో తప్పుడు చిత్రీకరణలో వుండడం దురదృష్టకరం అని బాధ పడుతున్నారు నక్సల్ నేతలు. తమను దారి తప్పిన ఆదర్శవాదులుగా చూస్తున్నారని; తమ ఉద్యమం అంటే అక్కడక్కడా, అప్పుడప్పుడూ జరిగే సంచలనాత్మక సంఘటనలు మాత్రమే అన్న తప్పుడు భావనలు ప్రచారం అవుతున్నాయని; తమను ఆచరణ సాధ్యం కాని ఆశయాల వెంటబడి పోతున్న వాళ్లుగా చూస్తున్నారని ఆవేదన చెందుతున్నారు వారు.

అయితే తమను దారితప్పిన ఆదర్శవాదులుగా, ఆచరణకు వీలుకాని ఆశయాల కోసం పోరాడే వారిగా చూస్తున్నందుకు అవేదన చెందడం తప్ప ఆ అభిప్రాయాలలోని వాస్తవికతను అర్థం చేసుకోవడానికి వారు ఎంతమాత్రం ప్రయత్నం చేయడం లేదేమోనన్పిస్తున్నది. కమ్యూనిజం సిద్ధాంతం ప్రాతిపదికన సమ సమాజ స్థాపన, విప్లవం, సాయుధ పోరాటంతో రాజ్యాధికారం సాధ్యమని నమ్మేవారి పట్ల జాలి పడడం తప్ప ఎవరూ ఏమీ చేయలేరు. నక్సలైట్లు అంటే మేధావుల క్రింద లెక్క, ప్రపంచ రాజకీయ పోకడలను అధ్యయనం చేయడంలో వారికి వారే సాటి అని పేరు.



గుత్తి కొండ సభలో నక్సల్ నేతలు

వారి విప్లవ సాహిత్యం నిండా వుండేది అదే. అటువంటి వారికి చైనా, రష్యా దేశాలలో జరిగిన, జరుగుతున్న మార్పులు అర్థం కావడం లేదంటే నమ్మగలమా? నిన్న మొన్నటి వరకు ప్రపంచ విప్లవాలన్నిటికీ ఆదిదేవత వంటిది రష్యా. విప్లవం ద్వారా రాజ్యాధికారం సాధించి, 75ఏళ్ల పాటు సోషలిస్టు రాజ్యాన్ని నడిపారా దేశంలో. లెనిన్, స్టాలిన్ వంటి నేతలు పరిపాలన చేశారు. తమ సిద్ధాంతాన్ని ధిక్కరించే వారి పట్ల కఠినంగా వ్యవహరించి మరీ పాలన చేశారు. అమెరికా ప్రభావిత పెట్టుబడిదారీ సంస్కృతి పవనాలు తమ దేశం పొలిమేరలు దాటి రాకుండా ఇనుపతెరలు బిగించారు. కానీ చివరకు ఏమైంది అక్కడ? 75ఏళ్ల పాలన తర్వాత కూడా ఆ దేశంలో ప్రజలకు తినడానికి తిండి, చేయడానికి ఉద్యోగం చూపించలేక పోయింది సోషలిస్టు పరిపాలన. కనీసం ప్రజలలో సమైక్య భావనలు కూడా పాదుగొల్పలేకపోయింది. ఆకలి గొన్న ప్రజలు తిరగబడి, కమ్యూనిస్టు పాలనను అంతం చేయగానే ముక్క చెక్కలైంది ఆ దేశం. ఈనాడు అక్కడ కాలేజి ఫీజు కట్టడానికి మానం అమ్ముకోవలసిన దౌర్భాగ్య స్థితిలో వున్నారు విద్యార్థినులు. 75 ఏళ్ల కృషి అంతరించి, సంపద సమస్తం మాఫియా ముఠాల వశం అయ్యింది. ఉన్న వాడికి, లేని వాడికి మధ్య అంతరం ఒక అగాధం వలె పెరిగి పోయింది.


చైనా దుర్గతి కూడా అంతే. కఠినంగానే కాక కర్కశంగా కూడా కమ్యూనిస్టు సిద్ధాంతాలను ఆచరించడానికి ప్రయత్నించారు అక్కడ. కానీ యాభై ఏళ్ల నిరంతర శ్రమ తర్వాత అర్థమైంది వారికి - తాము ఎంత పెద్ద తప్పు చేసింది. కమ్యూనిజాన్ని కేవలం తమ స్వంత రాజకీయ అధికారానికి మాత్రమే పరిమితం చేసి; పరిపాలన సమస్తాన్ని పెట్టుబడిదారీ పద్ధతులలో

తరువాయి 6వ పేజీలో




ఓం శ్రీ గురుభ్యోనమ:

సద్గురు షిరిడి సాయి తత్వాన్ని సద్గురుని అనుగ్రహంతో
త్రికరణ శుద్ధిగా ఆస్వాదిస్తూ, సద్గురువు అనుభూతులను
మనందరికీ అందిస్తూ, సద్గురు సాయి కృపా కటాక్షములతో
సద్గురు ప్రసాదిత సంకల్ప బలముతో స్వస్థతను
అర్హులందరికి ప్రసాదిస్తూ సద్గురు జ్ఞానాన్ని మనసా, వాచా,
కర్మణా మనకు ప్రసాదిస్తున్న పూజ్యులైన మా గురువు గారు
శ్రీ అనంతభొట్ల సుధాకరరావు గారి
43వ జన్మదిన శుభ సందర్భంగా
మా నమస్సుమాంజలులు.
ఇట్లు-శిష్య బృందం.



# వండగలవాడికే తిండి అనాలి కదా?

ప్రభుత్వంతో చర్చలకు వచ్చిన నక్సలైట్లు భూమి పంపిణీ సమస్య తమకు ఎంతో కీలకం అని పదే పదే చెప్తున్నారు; దున్నేవాడికే భూమి అనేది తమ నినాదము, విధానము అని నొక్కి వక్కాణిస్తున్నారు. భూసంస్కరణలు కఠినంగా, తక్షణం అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తున్నారు; భూస్వాముల దగ్గర వున్న మిగులు భూమిని, ప్రభుత్వ భూములను ఆక్రమించమని పేదలను రెచ్చగొడుతున్నారు; కొన్ని చోట్ల అప్పుడే ఈ ఆక్రమణల పర్వం మొదలై పోయింది; ఒక్కొక్క భూస్వామి కుటుంబానికి ఐదెకరాలు మాత్రమే వుంచి, తతిమాది మిగులు భూమిగా ప్రకటించాలని నిర్దేశిస్తున్నారు. వీటన్నిటికి రాజశేఖరరెడ్డి ప్రభుత్వం గంగిరెద్దు వలె తల ఆడిస్తున్నది. అన్ని రాజకీయ పార్టీలు భూమి పంపకానికి వంత పాడుతున్నాయి. చివరకు బిజెపి పార్టీ తరఫున బండారు దత్తాత్రేయ గారు దున్నేవాడికే భూమి దక్కాలని పిలుపు ఇచ్చారు.

పేదలకు భూమిపై హక్కు కల్పించడం, వ్యవసాయ కూలీని చిన్న రైతుగా మార్చడం ఎవరూ తప్పు పట్టలేని విషయాలు. ఆ ప్రాతిపదిక మీదనే ముప్పయ్యేళ్ల క్రితం ఇందిరమ్మ భూసంస్కరణలు ప్రతిపాదించి; అమలు చేసింది కూడా. ఆనాటి చట్టంలోని లోపాల వల్ల కొంత మంది భూస్వాములు అక్రమ మార్గాలలో, బినామీ పేర్లతో అనుమతికి మించిన భూమి నిలుపుకున్న మాటా నిజం. మరికొన్ని చోట్ల మిగులు భూమిగా ప్రకటించినదాన్నీ భూస్వాములు తమ స్వాధీనంలో వుంచుకున్న మాట కూడా వాస్తవం. ఆ తప్పులన్నిటినీ సరిదిద్దమని అడగడం న్యాయమే.

అయితే భూపరిమితిని మరింత తగ్గించమనడం; రైతుల భూములను మిగులు భూముల పేరిట ఆక్రమించుకోమని రెచ్చగొట్టడం మాత్రం సమంజసమన్పించడం లేదు. ముప్పయ్యేళ్ల నాడు దున్నేవాడికే భూమి అనే నినాదం ఎంతో ఆకర్షణీయంగా, ఆదర్శప్రాయంగా కన్పించిన మాట వాస్తవం. కానీ ఈనాడది బూజు పట్టిన ఆలోచన. వ్యవసాయ రంగంలో అప్పటికీ ఇప్పటికీ ఎన్నో మార్పులు వచ్చాయి. సేద్యం తీరు మారిపోయింది. ఆధునిక సాంకేతిక పద్ధతులు పాటించక పోతే వ్యవసాయం గిట్టుబాటు కాదిప్పుడు. చిన్న కమతాలు అభివృద్ధికి ఆటంకాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈనాటి జీవన ప్రమాణాలు, ఇప్పటి సగటు వ్యవసాయ రాబడి లెక్కలతో పోలిస్తే ఇరవై ఎకరాల రైతు కూడా నోటికి, చేతికి చాలని అత్తెసరు ఆదాయంతో సతమతమౌతున్నాడు.

భూమిలేని పేదవాడికి భూమిపై మోహం జాస్తిగా వుంటుంది. ఆర్థికంగానే కాక, సామాజికపరంగా కూడా భూమి కల్గి వుండడం వల్ల తనకొక గౌరవం, హోదా కల్గుతాయన్న ఆశే అందుకు కారణం. పేదవాడి ఈ బలహీనతను రాజకీయ అవసరాలకై రెచ్చగొట్టడం కోసమే దున్నేవాడికి భూమి నినాదం చేస్తున్నారే తప్ప, పేదవాడి మీద ప్రేమ వుండి కాదు. కేవలం వ్యవసాయం మీద మాత్రమే ఆధారపడితే ప్రజలందరికీ ఉపాధి కల్పించడం, జీవన ప్రమాణాలు పెంచడం సాధ్యం కాదని ప్రపంచ దేశాల అనుభవాలు నిరూపిస్తున్నాయి. పారిశ్రామిక, సేవా రంగాలను సమాంతరంగా అభివృద్ధి చేస్తేనే అందరికీ ప్రయోజనం అన్నది అందరూ అంగీకరించి తీరవలసిన వాస్తవం. వ్యవసాయ రంగం మీద ఆధారపడే వారి సంఖ్యను తగ్గించి, ప్రత్యామ్నాయ రంగాలలో ఉపాధి అవకాశాలు చూపించడం ఇప్పటి అవసరం.

దేశ సంపదలో వ్యవసాయ భూమికి ఎంత భాగం వుందో; పరిశ్రమలు, నగరాలలోని ఆస్తులకూ అంతే భాగం వుంది. అయితే నక్సలైట్లు, ప్రభుత్వము, రాజకీయ పార్టీలు కలిసి భూమి సమస్యను మాత్రమే ప్రస్తావిస్తున్నారు తప్ప తతిమా వాటి గురించి మాట్లాడడం లేదు. గ్రామంలో వెయ్యి ఎకరాల భూమి, హైదరాబాద్ నగరంలో వంద అంకణాల విలువ కూడా చేయదు. ఆ సంపద కొద్దిమంది చేతులలో కేంద్రీకృతం కావడం తప్పు కాదు కానీ; ఒక రైతుకు పాతికెకరాల మాగాణి వుండడం నేరమా? ఎక్కడి న్యాయం ఇది? దున్నేవాడికే భూమి అనే వారు కట్టేవాడికే భవనాలు; మెషీన్ తిప్పేవాడికే ఫ్యాక్టరీలు అనడం లేదెందువల్ల? రైతు మీద మాత్రమే ఎందుకు వీరికింత కక్ష? ఏ పాపం చేశాడు రైతు కుటుంబీకుడు?

ఆర్థిక శాస్త్ర సూత్రాలు, వామపక్ష సిద్ధాంతాలతో లేనిపోని మెలికలు పెట్టి, భూఆక్రమణలను ప్రోత్సహించి, రైతాంగానికి అపకారం చేయచూడడం అన్యాయం. పండే వాడికే తిండి అన్నంత కఠినంగా సోషలిజం లేదా కమ్యూనిజం సిద్ధాంతాలను ఆచరణకు తెగలిగినప్పుడు మాత్రమే రైతుల జోలికి రావాలి; అది చేతకానప్పుడు ఇదీ వీలు కాదు. భూకమతాల పరిమితిని మరింత తగ్గించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే గ్రామాలలో అగ్ని పర్వతాలు బద్దలౌతాయి; అనమ్మతి రాజ్యం చేస్తుంది; అరాచకం తాండవిస్తుంది. నక్సల్స్ వత్తిడికి లొంగి రాజశేఖరరెడ్డి గారు అటువంటి అవివేక నిర్ణయాలు తీసుకోరనే ఆశిద్దాం...

## జమీన్ రైతు

15-10-1954

పేజీలు:12 వెల : 0-2-0

## 50 ఏళ్ల క్రితం ఈ రోజు

### పల్లెటూళ్లు
### వెంకటగిరిలో ఒక స్త్రీ దుర్మరణం

6తేది షేక్ కరీం సాహెబ్ మందుల గిడ్డంగిలో మందు ప్రేలి దంవెళ్ల వెంకటమ్మ అను 40ఏండ్ల స్త్రీ ప్రమాదానికి గురియై మరణించింది. పకీరు కాలేషా, మాదిగ వెంకటమ్మ అను వారలకు గూడా తీవ్రంగా గాయాలు తగిలి ప్రాణాపాయ స్థితిలో హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రేలుడు విషయంలో పోలీస్ ఏమి చర్య తీసుకున్నదో దయచేసి చెప్తుందా?

### పార్లపల్లి బ్రిడ్జి

కొడవలూరు - ఊటుకూరు రోడ్డులో పార్లపల్లి సమీపంలో వున్న బ్రిడ్జి రెండు మాసాల క్రితం పడిపోయింది. దుస్థితిలో వున్న ఈ బ్రిడ్జి మీద రాకపోకలు జరిగితే ఏం ప్రమాదం వాటిల్లుతుందోనని ప్రయాణీకులు భయపడుతున్నారు. రోజూ ఎన్నో బస్సులు నడుస్తుంటాయి. శిథిలమైన ఈ బ్రిడ్జి మీద ఇంత రాకపోకలు జరిగితే, జనగాం రైలు ప్రమాదం లాంటిది ఏనాడైనా సంభవించవచ్చు. రోడ్డు సరే చెప్ప వీలులేనంత అన్యాయంగా వుంది. దానికి తోడు ఈ అబందర బ్రిడ్జి! హైవేస్ డిపార్టుమెంటు, జిల్లా అధికారులు దీని పట్ల తక్షణం శ్రద్ధ వహించవలసిందిగా కోరుతున్నాను.

### పల్లెపాడు ప్రసూతి కేంద్రం

కస్తూరిబా నిధి ఆంధ్రశాఖ ఆధ్వర్యాన శ్రీమతి డాక్టర్ ఎస్.లక్ష్మి గారి అధ్యక్షతన 3తేది పినాకినీ సత్యాగ్రహ ఆశ్రమంలో ప్రసూతి ఆరోగ్య కేంద్రం నెలకొల్పబడింది.

ఆరోగ్య విషయంలో గ్రామస్తుల బాధ్యతల గూర్చి డాక్టర్ లక్ష్మి గారు వుద్బోధించారు. కస్తూరిబా నిధి ఆంధ్ర శాఖ కార్యదర్శి శ్రీమతి దిగుమర్తి బుచ్చి కృష్ణమ్మగారు కస్తూరిబా ట్రస్టు ఆశయాలను వివరించిరి. ఈ ఆరోగ్య కేంద్రానికి పంచాయతీ బోర్డు సహాయ సహకారాలుండగలవని అధ్యక్షులు శ్రీ వేదాచలం గారు వాగ్దానం జేసిరి.

### పంబలేరు బ్రిడ్జి

ట్రంకురోడ్డు రహదారికి గూడూరు పంబలేరు బ్రిడ్జి ఒక పెద్ద ఆటంకం. ఈ బ్రిడ్జి రెండు, మూడు సంవత్సరాలు నాడు పడిపోతే ఈనాటికి అతిగతీ లేదు. దీనివల్ల వర్షాకాలం ట్రంకురోడ్డు రహదారి సాగనే సాగదు. ఈ విషయం అట్లానెట్టి తాత్కాలికంగా ప్రక్కన వేసిన రోడ్డుకు సిమెంటుతో రివిట్‌మెంటు కట్టారు. ఇది నిరుపయోగమైన పని. మంత్రుల కార్లను గూడా అటకాయించే ఈ బ్రిడ్జి విషయంలోనే జాప్యం జరిగితే తక్కిన చిన్న చిన్న బ్రిడ్జిల విషయం యిదొక లెక్కా డొక్కా?

ఇక్కడ ప్రయాణీకులకు ఏదో ఒక ప్రమాదం జరిగేంత వరకు యెవరి దృష్టి దీనిమీద పారదులెండి!

### నెల్లూరు ముచ్చట్లు
### రెండు మాసాల ప్రిన్సిపాల్

విఆర్ కాలేజి ప్రిన్సిపాల్ సచ్చిదా

తొరవ 10పేజీలో

# నెల్లూరుకు పీడ విరగడయింది

నెల్లూరును కార్పొరేషన్ చేయడంతో మునిసిపల్ కౌన్సిల్ పీడ విరగడయ్యింది. వందేళ్లకు పైగా చరిత్ర గల నెల్లూరు మునిసిపాలిటీలో మొన్న రద్దు అయినటువంటి పాలక వర్గాన్ని ఎప్పుడూ చూడలేదు. ప్రజా ధనాన్ని మంచినీళ్ల మాదిరి స్వాహా చేశారు. బూడిద సిమెంటుతో రోడ్లు, అధ్వాన్న డ్రైనేజీలు, మంచినీటి ట్యాంకర్లు, మోటార్ల రిపేర్లు, బ్లీచింగ్ పేరిట లక్షలాది రూపాయలు స్వాహా చేశారు. పర్సంటేజీలు ముందుగా నిర్ణయించుకొని వేసిన రోడ్లన్నీ దెబ్బతిని పోయాయి. మంచినీటికై అన్ని కాలాల్లో అల్లాడవలసిన పరిస్థితి కల్పించారు. అవినీతే పరమావధిగా ముందుకు సాగిన ఈ మునిసిపల్ పాలనను మళ్లీ ప్రజలు చవి చూడకూడదని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. కార్పొరేషన్ నేతృత్వంలో ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని విశ్వసిస్తున్నాను.

నెల్లూరు — టి.వి.నారాయణ

## శ్రీనాథుని గూర్చి మర్చిపోయారు

అక్టోబరు 2తేది టౌన్‌హాల్‌లో వర్థమాన సమాజం నేతృత్వంలో జరిగిన శ్రీనాథ జయంతి సభకు వెళ్లగా తీవ్ర నిరాశ మిగిలింది. వక్త, తిరుపతి పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ కుసుమ కుమారి సభలో శ్రీనాథుని మినహాయించి మిగతా విషయాలన్నీ మాట్లాడారు. మహానుభావుల జయంతి రోజు వారి జీవితంలోని కొన్ని కోణాలనైన స్పృశించే వుపన్యాసాలు నిర్వాహకులు ఏర్పాటు చేయమని మనవి.

నెల్లూరు — ఎ.రామయ్య

## వీధిలో మురుగునీటి మడుగు

అడ్డరోడ్డులో తూర్పువైపున వున్న మురుగునీరు అదే రోడ్డులోని ప్రాథమిక పాఠశాల ప్రక్కనే వున్న పంట కాలువలోకి పోవడం లేదు. పంట కాలువ ఎత్తులో వుంది. దీనివల్ల వీధిలో మురికి మడుగు తయారయ్యింది. పాత కమీషనర్ ఈ వీధిలో డ్రైనేజి నిర్మాణానికి సమ్మతి తెలియజేశారు. గత ఏడాది జనవరి నెల నుంచి ఈ సమస్య అపరిష్కృతంగా వుంది. మునిసిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారియైన జిల్లా కలెక్టర్ రాజశేఖర్ అయినా ఈ సమస్యను పరిష్కరిస్తే ప్రజలు సంతోషిస్తారు.

నెల్లూరు — వి.నరసింహారావు

## దిగజారుతున్న విలువలు

భారతదేశంలో ప్రవేశించిన విని మయ సంస్కృతి మూలంగా విలువలు

## జనవాణి

దిగజారుతున్నాయి. బూతు పుస్తకాలు, క్రైం చిత్రాలు, నీలి చిత్రాలు, అందాల పోటీలు, అంగాంగాలను ప్రదర్శించే అసభ్య నృత్యాలు, పట్టణాల్లో పబ్‌లు, గ్రామాల్లో బెల్టుషాపులు పెరిగి పోతున్నాయి. మల్టీ నేషనల్ కంపెనీలు మన నీటితో మినరల్ వాటర్, కూల్‌డ్రింక్స్‌ను తయారు చేస్తుంటే వాటిని మనం కొని తాగుతున్నాం. వాలంటైయిన్ డేలు, డేటింగులు, క్రికెట్‌లను యువతీ, యువకుల మీద రుద్దుతున్నారు. దీని మూలంగా అత్యుత్తమ భారతీయ సంస్కృతి సర్వనాశనమై పోతోంది. మన సంస్కృతిని ఎలా కాపాడుకోవాలో తెలియని పరిస్థితులు ప్రస్తుతం మన ముందున్నాయి.

నెల్లూరు — వి.హారిత

## వైద్యో నారాయణో హరిః

దానికి తెలియజేస్తున్న నిరసనలు సమాజాన్ని కలవర పరుస్తున్నాయి. భయంకర వ్యాధులతో మృత్యువుతో పోరాడే రోగులకు వున్నత సేవలందించి ప్రాణదానం చేయవలసిన వైద్య సంస్థలు, డాక్టర్లు చీటికి మాటికి విధులు బహిష్కరించడం దారుణం. ఒక్కొక్క విద్యార్థి, వైద్యుడు కావడానికి 10లక్షల రూపాయలకు పైగా ప్రజాధనం వినియోగిస్తున్నారు. వైద్యుల విధి నిర్వహణకు ఏదైనా ఆటంకాలు ఎదురైతే వాటిని చట్ట పరిధిలోనే పరిష్కరించుకోవాలి. అత్యవసర సర్వీసుల్లో చీటికి మాటికి సమ్మెకు దిగడాన్ని ప్రభుత్వం నిషేధించాలి.

నెల్లూరు — బి.పట్టాభిరామయ్య

## నక్సల్స్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలి

పీపుల్స్‌వార్, జనశక్తి గ్రూప్ నక్సలైట్లతో రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు 15తేది చర్చలు జరపబోతుంది. 11తేది అరణ్యాలు వీడి జనారణ్యంలోకి వచ్చిన నక్సల్ నేతలకు గుత్తికొండబిలం వద్ద జరిగిన సభలో ప్రజలు నీరాజనాలు పలికారు. తుపాకి గొట్టం ద్వారా నక్సల్ ఉనికి వున్న 13 రాష్ట్రాల్లోనూ రాజ్యాధికారం సాధ్యం కాదు. పీపుల్స్‌వార్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ చెబుతున్న భూ సమస్య, ప్రపంచ బ్యాంకు దాసోహమనని రీతిలో పాలన, అవినీతి అదుపులో పెట్టాలన్న అజెండాతో వారు ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తే బాగుంటుంది.

నెల్లూరు — వి.సత్యనారాయణ

## ముఖ్యమంత్రి అదృష్టవంతుడు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించే సమయానికి రాష్ట్రంలో కరవు పరిస్థితులు

# జనవరికి పెన్న నీళ్లు

నెల్లూరు నగర తూర్పు ప్రాంతవాసులకు నూతన సంవత్సర కానుకగా పెన్నానది నీటిని అందించనున్నట్లు ఎమ్మెల్యే వివేకానందరెడ్డి చెప్పారు. ఆదిత్యనగర్‌లో 13వతేది సిమెంటు రోడ్డు పనిని ప్రారంభించి విలేకరులతో మాట్లాడారు. అర్ధాంతరంగా ఆగి వున్న తూర్పు ప్రాంతానికి మంచినీటి సరఫరా చేసే పనులు వెంటనే మొదలయ్యేలా చర్యలు తీసుకొంటున్నాం. డిఎఫ్ఐడి సి ప్లాన్‌లోని నిధులతో బాలాజీ నగర్, ఎసినగర్, ఎన్టీఆర్ నగర్ ప్రాంతాల్లో డ్రైనేజి సమస్య పరిష్కారమవుతుంది. 35 కోట్ల రూపాయల డిఎఫ్ఐడి నిధులు

**తూర్పువాసులకు వివేకా హామీ**

మురిగి పోకుండా ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాం. మరో 100 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులు రాబోతున్నాయి. ఉచితంగా వచ్చే నిధులు వినియోగించను ముందు వెనుక ఆలోచిస్తే ఎలానన్నారు. ఈ నిధులతో చేయబోయే పనులన్నీ పటిష్టంగా జరుగుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు పనబాకలక్ష్మి, నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ జిల్లాకు చెందిన మిగతా పది మంది ఎమ్మెల్యేలు ముక్తకంఠంతో కోరడం వల్లే నెల్లూరు మునిసిపాలిటీని ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి కేవలం పది రోజుల్లోనే కార్పొరేషన్ చేసినట్లు చెప్పారు.



పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా నెల్లూరు వెంగళరావునగర్‌లో పిల్లలకు వ్యాక్సిన్ వేస్తున్న ఎమ్మెల్యే వివేకానందరెడ్డి.

# ఇక బోర్లకూ పర్మిషన్

ఇష్టారాజ్యంగా బావులు, బోర్లు త్రవ్వకానికి రాష్ట్ర ప్రభుత్వం బ్రేకులు వేసింది. ఇక నుంచి బావి, బోర్లు త్రవ్వాలంటే ప్రభుత్వ అనుమతుండాలి. బావి, బోరు త్రవ్వకానికి గ్రామాల్లో గ్రామకార్యదర్శి, మునిసిపాలిటీ, నగరపాలక సంస్థల్లో నీటి సరఫరా, మురుగునీటి మండలిలో రిజిస్ట్రేషన్ చేయించాలి. వీటిని చేయించాలనుకొనేవారు పూర్తి వివరాలతో నీరు, భూమి, చెట్ల అథారిటీ అధికారులకు దరఖాస్తు చేయాలి. బావి ప్రతిపాదిత స్థలం, సర్వే నెంబరు, ప్లాట్ నెంబరు,

**సర్కార్ తాజా ఆదేశాలు**

బావిలోతు, వెడల్పు, వినియోగ ఉద్దేశ్యం, సమీపంలోని బావి దూరాలతో ఒక స్కెచ్‌ను పొందుపర్చాలి. సంబంధిత అధికారులు స్థలాన్ని సందర్శించాకే అనుమతి లభిస్తుంది. తాగు నీటి సరఫరా, బోరు బావులకు 250 మీటర్ల దూరంలో కొత్త బోర్లు, బావి త్రవ్వకానికి ఇక అనుమతివ్వరు. బావులకు 10 రూపాయలు, బోర్లకు 100 రూపాయలు, రిగ్గు యజమాను లైతే వెయ్యి రూపాయలు రిజిస్ట్రేషన్ ఫీజుగా చెల్లించాలి. ఈ నిబంధనలు ఆచరణ సాధ్యమేనా అనేది సందేహం.

# ఆరోగ్య దొరకు అవినీతి గజ్జి

నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ చేస్తున్న అవినీతికి అంతే లేకుండా పోతూంది. ప్రతి వ్యవహారం లోనూ పెద్ద మొత్తంలో మామూళ్లు వసూలు చేయడం మూలంగా బాధ్యతలు స్వీకరించి కేవలం ఎనిమిది నెలలకే పట్టణంలో భారీగా ఆస్తుల కొనుగోళ్ల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఆత్మకూరు పిహెచ్‌సి నుంచి ఫిబ్రవరిలో నెల్లూరుకు వచ్చిన హెల్త్ ఆఫీసర్‌కు పలు దఫాలుగా జరిగిన పల్స్ పోలియో కార్యక్రమం పరమాన్నంగా మారింది. పల్స్‌పోలియో కార్యక్రమ నిర్వహణలో భాగంగా పట్టణంలో పబ్లిసిటీ సెంటర్లకు వ్యాక్సిన్ తీసుకెళ్లే కార్ల ఏర్పాటుకు లక్షా 50వేల రూపాయలు మంజూరు చేస్తారు. ఈసారి ఆటోల పబ్లిసిటీ కూడా లేకుండా. 18 కార్లు పెట్టి; 37 కార్లకు బాడుగ చెల్లించినట్లు నిధులు స్వాహా చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కార్పొరేషన్‌లో ప్రస్తుతం చెత్త తొలగింపు విధుల్లో వుండే ట్రాక్టర్ల డ్రైవర్లు మిగులు డీజిల్ మామూలుగా ప్రతినిత్యం కొంత మొత్తం ఆయనకు ఇవ్వాలట. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పెద్ద మొత్తంలో బ్లీచింగ్ బస్తాలు స్టోరు నుంచి మాయ మయ్యాయి. దీనికి కారకులెవరో? హెల్త్ ఆఫీసర్ మూలంగా నెల్లూరు పట్టణంలో గత ఆరు నెలలుగా కుటుంబ నియం త్రణ ఆపరేషన్లు జరగడం లేదు. వెంకటే శ్వరపురంలో ఈ మధ్యే ఈ అధికారి ఒక కొత్త ఇంటిని కట్టడంతో పాటు, విలువైన స్థలం కూడా కొనుగోలు చేశా డంటే ఈయన ఆదాయం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఇటువంటి అధికారి నేతృ త్వంలో నెల్లూరు నగర ప్రజల ఆరోగ్యం భద్రంగా ఎలా వుంటుంది? కార్పొ రేషన్‌లో అవినీతి జంబూకాల పని పట్టడంతో పాటు, పాలన సరైన గాడిలో పెట్టాల్సిన బాధ్యత నగర పాలక సంస్థ ఇన్‌ఛార్జి కూడా అయిన జిల్లా కలెక్టర్ పైనే వుంది.

## త్రిపాత్రాభినయం చేస్తున్న ఇరిగేషన్ ఎస్ఇ

జిల్లాలో అత్యంత కీలకమైన మూడు పోస్టుల నిర్వహణను ఒకే అధి

తరువ 11వ పేజీలో

# పెద్దాస్పత్రిలో నకి'లీలలు'

నెల్లూరు పెద్దాస్పత్రిలో ముందుగా నిర్ణయించిన రేటు చెల్లిస్తే అంగవైకల్యం లేని వారికి వైకల్యం వున్నట్లు సర్టిఫికెట్ ఇచ్చేస్తారు. దీనివల్ల వాస్తవంగా అంగవైకల్యంతో బాధపడే వారు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ మధ్య అంగవైకల్యం గల వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుండడంతో ఈ సర్టిఫికేట్ల కోసం ప్రతినిత్యం వందలాది మంది ఆస్పత్రికి

**డబ్బిస్తే ఏ సర్టిఫికేట్ అయినా ఇస్తారు**

వస్తున్నారు. ఆస్పత్రిలో పనిచేసే ఎన్ఎంఆర్‌లు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ ఈ సర్టిఫికేట్లు ఇప్పిస్తున్నారు. చెవుడు, కంటి విభాగాల్లో ఈ నకిలీ సర్టిఫికేట్లు ఎక్కువగా జారీ అవుతున్నాయి. వీటికి తోడు ఉద్యోగుల శెలవు కోసం, వికలాంగులకు రైల్లు, బస్సుల్లో ఉచిత ప్రయాణానికి నకిలీ సర్టిఫికేట్లు ఇస్తున్నారు. వాలంటరీ రిటైర్‌మెంట్ కావాల్సిన ఉద్యోగులు పదివేలు చెల్లిస్తే మాయరోగం వున్నట్లు సర్టిఫికేట్ ఇస్తున్నారు. వ్యాధుల

తరువ 11వ పేజీలో

# భోజన పథకంలో స్వాహా

గ్రామీణ ప్రాంతాలకు చెందిన పిల్లలు సక్రమంగా స్కూల్‌కు వచ్చేందుకు సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న మధ్యాహ్న భోజన పథకం నెల్లూరు రూరల్ మండలంలో గతి తప్పింది. రెవెన్యూ అధి కారులు, ఉపాధ్యాయులు కుమ్మక్కై పిల్లల కడుపులు కొట్టి తమ కడుపులు నింపుకొంటున్నారు. రూరల్ మండలంలో 20కి పైగా గ్రామాల్లో స్కూల్ రిజిష్టర్‌లో వున్న పిల్లలకన్నా

**రూరల్‌లో అవినీతి పందికొక్కులు**

మధ్యాహ్నం భోజనం చేసే రిజిష్టర్‌లో పిల్లలు ఎక్కువగా నమోదవుతున్నారు. ఉన్న వారికి సైతం నామమాత్రంగా వండి పెడుతుండడంతో పిల్లలు ఆ భోజనం చాలక మళ్లీ ఇళ్లకు వెళ్తున్నారు. రోజూ మిగిల్చిన బియ్యాన్ని, ఇతర పచారీ సరకులను నెలకోసారి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఇటీవల డిప్యూటీ డిఇఓ రూరల్ మండలంలోని పాఠశాలను మధ్యాహ్న భోజన సమయంలో సందర్శించగా 20 మంది

తరువ 11వ పేజీలో




# శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానము

స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు - 524 002. ఫోన్: 2324785

## శరన్నవరాత్రి మహోత్సవముల ఆహ్వానం

**తేది 14-10-2004 నుండి 24-10-2004 వరకు**

ఆర్యా! స్వస్తిశ్రీ తారణనామ సంవత్సర ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి మొదలు శుద్ధ ఏకాదశి వరకు దేవి శరన్నవరాత్రి మహోత్సవములు వైభవముగా జరుగును. ప్రతి నిత్యం అమ్మవారికి ఉ 6గం॥ల నుండి శ్రీ సూక్త అభిషేకము, శ్రీవాసవి అష్టోత్తరము, సహస్ర నామార్చన, త్రిశతి, దేవీఖడ్గమాల, సప్తశతి పారాయణము, నవావరణ పూజలు జరుగును. సాయంకాలం 6గం॥ల నుండి మూలవర్లకు పూలంగిసేవ, వేదికపైన ఉత్సవర్లకు రోజుకు ఒక నవదుర్గా అలంకారము విశేషముగా చేయబడును. ప్రతి రోజు సాయంత్రం 6.30 గం॥లకు విశేష సాంస్కృతిక కార్యక్రమములు జరుపబడును. పై ఉత్సవములలో భక్తులందరూ ప్రతిరోజు జరుగు కార్యక్రమములలో పాల్గొని అమ్మవారిని దర్శించి, తీర్థప్రసాదములు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులగుదురని కోరుచున్నాము.

ముఖ్య గమనిక: 24.10.04 మహర్నవమి ఉదయం 10గంటలకు 9 మంది కన్యలచే నవకన్యల పూజ జరుగును. విడివిడిగా కన్యలు ఊరేగింపుగా బయలుదేరి, దేవస్థానమునకు చేరి పూజలో పాల్గొందురు.

23.10.04 తేదిన సాయంత్రం 6.30 గంటలకు అమ్మవారు పులి వాహనముపై నగరోత్సవము జరుగును.

ఈ ఉత్సవములో మహిళలచే కోలాటం, తెనాలి బ్యాండ్, తీలుగుర్రాలు, పులి వేషాలు మొదలగు వినోద ప్రదర్శనలు జరుగును.

గుండ్లపల్లి సుధాకర్‌రావు, ఛైర్మన్


# అక్రమ బియ్యం - పన్నుల ఎగనామం

నెల్లూరులో ప్రభుత్వ లైసెన్సు లేకుండానే అక్రమంగా బియ్యం అమ్మే వ్యాపారం జోరుగా సాగుతుంది. వ్యాపా రులు, రైస్‌మిల్లర్లు, ట్రేడర్ల నుంచే గాక జీరో బియ్యాన్ని సైతం కొనుగోలు చేసి ప్రజలకు విక్రయిస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారం వల్ల 20లక్షలకు పైగా అమ్మ కపు పన్ను, వాణిజ్య పన్నులను ప్రభు త్వం నష్ట పోతూంది. పట్టణంలో హోల్ సేల్, చిన్న చిన్న బియ్యం దుకాణాలు 500 వరకున్నాయి. వీటిలో అధికా రికంగా లైసెన్సు పొందినవి 50 మాత్రమే వున్నాయి. బియ్యం దుకాణదారులు రైస్‌మిల్లర్లు, ట్రేడర్ల నుంచి బియ్యం నూకలు కొనుగోలు చేస్తుంటారు. వీటి కొనుగోలు సమయంలో బిల్లులు తీసు కోవాలి. బిల్లుల ఆధారంగా నూటికి 4శాతం సేల్స్‌ట్యాక్స్, 1శాతం వ్యవసాయ మార్కెట్ యార్డుకు ట్యాక్స్ కట్టాలి. బియ్యం అమ్మకం చేసేవాళ్లు, రైస్‌మిల్లర్లు, ట్రేడర్లు కుమ్మక్కై ఈ పన్ను ఎగ్గొడుతు న్నారు. బియ్యం దుకాణం నడపాలంటే ఐదువేల రూపాయలు వాణిజ్య పన్నుల శాఖకు చెల్లించి లైసెన్సు పొందాలి. ఏడాదికొకసారి 500 రూపాయల ఫీజు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలి. కొను గోలు, అమ్మకాల రిజిష్టర్‌లో తప్పనిసరిగా వివరాలన్నీ నమోదు చేయాలి. తనిఖీకి

**టౌన్‌లోని బియ్యం వ్యాపారుల తీరుతెన్ను**

వచ్చే వాణిజ్య పన్నుల శాఖ అధికా రులకు ఈ లావాదేవీలు తెలియజేయాలి. కాని నెల్లూరులోని ఏ బియ్యం షాపులో కూడా ఈ వివరాలన్నీ లేకుండానే నెలసరి లక్షల రూపాయల వ్యాపారం జరుగుతుంది. దీనిమూలంగా వాణిజ్య పన్నుల శాఖ పెద్ద మొత్తం నష్టపోతున్నా నిమ్మకు నీరెత్తినట్లుంది. పట్టణ పరిసర ప్రాంతాల్లోని 150 రైస్‌మిల్లులు, 40 బాయిల్డ్ రైస్‌మిల్లుల నుంచి రాష్ట్రంతో పాటు, ఇతర రాష్ట్రాలలో అమ్మకం చేస్తున్న బియ్యానికి బిల్లులుండడం లేదు. రేషన్‌షాపుల నుంచి రీసైక్లింగ్ అవుతున్న బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్మే స్తున్నారు. వాణిజ్య పన్నుల శాఖ లం చాల మత్తు వీడితే ప్రభుత్వ ఖజానాలో ప్రతి ఏడాది కోట్లాది రూపాయల సొమ్ము బియ్యం అమ్మకం మూలంగా జమ అవుతుంది.

## రాజరాజేశ్వరమ్మ ఆలయంలో దసరా!

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీరాజ రాజేశ్వరమ్మ ఆలయంలో దసరా శరన్నవ రాత్రి మహోత్సవాలు 15 నుంచి 23తేది వరకు జరుగుతాయి. 16తేది గాయత్రి, 17తేది అన్నపూర్ణా, 18తేది

తరువ 11వ పేజీలో

## జిల్లా వార్తలు

# బుచ్చిలో కార్ల దొంగలు

ఇతర రాష్ట్రాల నుంచి కార్లను దొంగిలించి బుచ్చిరెడ్డిపాళెం కేంద్రంగా వాటిని జిల్లాలోని వివిధ ప్రాంతాలలో అమ్మివేస్తున్న అంతర్ రాష్ట్ర దొంగ కార్ల ముఠా గుట్టు రట్టయ్యింది. గత సంవత్సర కాలం నుంచి ఈ వ్యవహారం బుచ్చిలో జరుగుతుండగా ఎట్టకేలకు ఎస్పీ, ఐడి పార్టీ నేటికి తెలుసుకోగల్గింది. గతంలో

### పట్టి వదిలారు

పనిచేసిన పోలీసు అధికారులు ఈ దొంగ కార్లను ఉపయోగించుకొని వదిలేశారే తప్ప వాటిని పట్టించుకొన్న దాఖలాలు లేవు. బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన తెలనాకుల ఆదినారాయణ గత సంవత్సర కాలం నుంచి తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్లలో తిరుగుతూ వాటిని కొనడం, అమ్మడం చేసేవాడు. ఇతని మీద బుచ్చి పోలీసులకు తప్ప మిగతా పోలీసులందరికీ అనుమానముండేది. ఈ మధ్య విశాఖపట్నంలో దొంగిలించబడ్డ ఎపి 31ఎ7036 నెంబరు గల మారుతీ 800 కారు బుచ్చి మండల పరిసర ప్రాంతాలలో వున్నట్లు ఆ కారు యజమానికి పోలీసులు చెప్పారు. పెనుబల్లికి చెందిన నారాయణ వద్ద వుండిన మారుతీ కారును, అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా ఆ కారును తాను బుచ్చి తెలనాకుల ఆదినారాయణ వద్ద కొన్నట్లు ఒప్పుకొన్నాడు. దీంతో ఆదినారాయణను అదుపులోకి తీసుకొని అతని వద్ద గల తమిళనాడు రిజిస్ట్రేషన్ గల టి.సి.డబ్ల్యు 2725 మారుతీ కారును కూడా స్వాధీనం చేసుకొన్నారు. కాని అదుపులోకి తీసుకొన్న ఆదినారాయణను ఎందుకు వదలేసినట్లు? అతన్ని మేము అరెస్టు

తొరవ 8వ పేజీలో

# సిఎం పేరుతోనూ నిధుల స్వాహా?

ముఖ్యమంత్రి గూడూరు పర్యటన పేరిట ఆర్అండ్‌బి శాఖాధికారులు ఏడు లక్షల రూపాయల స్వాహాకు రంగం సిద్ధం చేసుకొన్నారు. రాజీవ్ పల్లెబాట కార్యక్రమంలో ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి అసలు గూడూరు పట్టణంలో అడుగిడలేదు. బైపాస్‌రోడ్డుకు సమీపంలోని జనార్ధనరెడ్డి కాలనీ వద్ద జరిగిన చల్లకాలువపై వంతెన శంకు స్థాపన కార్యక్రమంలో పాల్గొని వెళ్లారు. కాని ఆర్అండ్‌బి అధికారులు తమ అతిథి గృహం ముస్తాబుకు 70వేలు, అక్కడే బోరు వేయించినందుకు 80 వేలు, సభా వేదిక నిర్మాణానికి 25 వేలు, వాటర్ ట్యాంకు వద్ద నుంచి బైపాస్ రోడ్డు వరకు రోడ్డు ప్యాచ్ వర్కులకు రెండు లక్షలు, సాయి బాబా గుడి నుంచి రైల్వేస్టేషన్ వరకు రోడ్డుకిరువైపులా లెవలింగ్‌కు మరో రెండు లక్షలు ఖర్చు పెట్టినట్లు లెక్కలు సిద్ధం చేశారు. వేదిక నిర్మాణ ఖర్చులు, కరెంటు, జనరేటర్ ఖర్చులన్నీ గూడూరు కాంగ్రెస్ నేతలు భరించగా, బిల్లులు మాత్రం ఆర్అండ్‌బి అధికారులు పెట్టుకోవడం విశేషం.

### రోడ్డెక్కిన అంగన్‌వాడీలు!

సరిగ్గా రాని జీతాలు, పసిబిడ్డల పస్తులు, అధికారుల వేధింపులతో విసిగి వేసారిన అంగన్‌వాడీ టీచర్లు రోడ్డెక్కి తమ నిరసన తెలిపారు. నాలుగు రోజుల క్రితం బుచ్చి, దగదర్తి, సంగం, అల్లూరు మండలాలకు చెందిన దాదాపు 120 మంది అంగన్‌వాడీ టీచర్లు బుచ్చి సిడిపిఓ ఆఫీసు ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో 30 మంది పిల్లలు వుండాలని, అలా వుంటేనే మీకు జీతాలు ఇస్తామని సిడిపిఓ శారదా కుమారి బెదిరిస్తుందని చెప్పారు. అలా కాని పక్షంలో తమని ఉద్యోగాల నుంచి తీసేస్తానని వేధిస్తుందన్నారు. నెలంతా కష్టపడ్డా జీతాలు ఈ మధ్య సరిగ్గా ఇవ్వడం లేదని బడ్జెట్ కంట్రోల్ పేరుతో మూడు, నాలుగు నెలలకు జీతాలిస్తుంటే పసి బిడ్డలు ఆకలితో మాడుతున్నారని తెలిపారు. పిల్లలకు పెట్టే ఆహారం సిడిపిఓ ఎంతయిస్తే అంత తీసుకోవాలని, లెక్కలు అడిగితే రేపు మీ సెంటరుకి వచ్చి తనిఖీలు చేసి కలె

తొరవ 7వ పేజీలో

# చౌక చింతపండు మాయం

కావలి పట్టణంలోవున్న 27 చౌక దుకాణాల ద్వారా చింతపండు పంపిణీ కోసం పౌరసరఫరాల శాఖ ఒక్కొక్క షాపుకు రెండు క్వింటాళ్లు తగ్గకుండా చింతపండును ఇటీవల సరఫరా చేసింది. కార్డుదారులకు పంపిణీ చేయమని ఆదేశించింది. మార్కెట్‌లో చింతపండు ధర ఆకాశాన్నంటుతుండడంతో చౌక దుకాణాల డీలర్లు మొక్కుబడిగా ఒక్కరోజు మాత్రమే పంపిణీ చేసి మిగతాది బ్లాక్ మార్కెట్‌కు తరలించడంతో రైతుబజారులోని స్టాల్‌పై ఒత్తిడి పెరిగింది. అక్కడ రోజుకు 5 క్వింటాళ్లు మాత్రమే పంపిణీ చేయాలని ఆదేశించడంతో అందరికీ అందక ఇబ్బందులుపడుతున్నారు. డీలర్ల వద్ద ముడుపులు తీసుకొని సివిల్ సప్లయిస్ డిటి అంతా సక్రమంగా జరిగినట్లు సర్టిఫికేట్ ఇస్తున్నారు. జాయింట్ కలెక్టర్ విచారణకు ఆదేశించి చింత పండు ప్రజలందరికీ దక్కేలా చేయాల్సి వుంది.

# దేవుళ్లకూ కష్టాలే

### పార్లపల్లిలో విచిత్రం

విడవలూరు మండల పరిధిలోని పార్లపల్లి గ్రామానికి చెందిన అలఘునాథ కైలాసనాథ, అనంతపద్మనాభ స్వామి దేవాలయాలకు పేరుకు మాత్రం 61 ఎకరాల 22సెంట్ల భూములున్నా నిత్య ధూప, దీప నైవేద్యాలకు గ్రామస్తులపై ఆధారపడాల్సి వస్తుంది. ఒకటి కాదు రెండు కాదు ముచ్చటగా మూడుసార్లు వాయిదా పడి, నాలుగవ సారి ఈ నెలలో జరగాల్సిన వేలం పాటలు కూడా వాయిదా పడి అసలు ఈ భూములకు వేలం జరుగుతుందా లేదా అన్న అనుమానాన్ని గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు సిరులు పండాల్సిన మాగాణి భూములు నేడు కంపచెట్లు మొలచి బీడు భూములను తలపిస్తున్నాయి. ఇంకా ఆలస్యం చేస్తే ఈ 61.22 ఎకరాల పొలంకు ఎలాంటి లీజు లభించక పోగా అది బీడుగా మారే ప్రమాదముంది. కౌలు వేలం నేపథ్యంలో చోటు చేసుకున్న రాజకీయాలు, అందుకు తలొగ్గిన అధికారుల వైఖరే ఇందుకు కారణాలుగా కన్పిస్తున్నాయి. అప్పట్లో పార్లపల్లి గ్రామానికి చెందిన అడపాల వారి కుటుంబం ములుమూడి కృష్ణారెడ్డిల నేతృత్వంలో కొన్నేళ్లు కొనసాగినా ఈ అనాది భూములను 1950-52 ప్రాంతంలో ఎండోమెంట్‌లో కలిపారు. 1952లో అప్పటి ఎమ్మెల్యే బస్వారెడ్డి శంకరయ్య ఫీల్డు లేబర్ కోఆపరేటివ్ సొసైటీని స్థాపించి ఆలూరుపాడు, మానేగుంటపాడు గ్రామాలకు చెందిన పేద రైతులకు కౌలుకిప్పించారు. 1965వ సంవత్సరం వరకు ఈ సొసైటీ క్రిందనే ఈ భూములు సాగయ్యాయి. అటు తర్వాత మళ్లీ

తొరవ 8వ పేజీలో

# గ్యాస్ డీలర్ల దోపిడీ

కావలి పట్టణంలోని గ్యాస్ డీలర్లు అధికార్లకు ముడుపులిస్తున్నాం కదా, మమ్మల్ని ఎవరు నిలదీస్తారన్న ధీమాతో ప్రజల సొత్తు మూడు లక్షలు యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారు. సివిల్ సప్లైస్ నిర్ణయించిన ధరల ప్రకారం ఒక గ్యాస్ సిలిండర్ ఇంటికి డెలివరీ ఇస్తే 298

### అడిగే వారు లేరు

రూపాయలు. గోడౌన్ వద్ద తెచ్చుకొంటే 290 రూపాయల చొప్పున వసూలు చేయాలి. కాని ట్రాన్స్‌పోర్టు పేరుతో 310 రూపాయలు, మెట్ల మీదకి తెచ్చినచో 320 రూపాయలు చొప్పున వసూలు చేస్తున్నారు. అడిగితే కాని బిల్లు ఇవ్వరు. బిల్లులో మాత్రం 298 రూపాయలు వుంటుంది. రిక్షా, ఆటో బాడుగ కలిపి 310, 320 రూపాయలు అని చెప్పి నెలకు 3 లక్షల రూపాయలు అక్రమంగా దోచుకుంటున్నారు. కావలి పట్టణంలో హెచ్‌పి, ఇండియన్, భారత్ గ్యాస్ కంపెనీలు వున్నాయి. మొత్తం కలిపి 15,000కనెక్షన్లు పైగా వున్నాయి. ఈ వ్యవహారమై వున్నతాధికారులు విచారణ చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

### దిక్కు దిశాలేని కావలి ఏరియా ప్రభుత్వాస్పత్రి

కావలి ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడం తెలిసిందే. ఎవరైనా బతికి కొన ఊపిరితో వస్తే కావలి ఏరియా వైద్యశాలలోని వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోతున్నారు. తరచూ ఈ వైద్యశాల వైఖరిపై నిరసనలు హోరెత్తుతున్నా డిఎంహెచ్ఓ స్పందించక పోవడం ఆశ్చర్యకరం. సెప్టెంబరు 29 విడవలూరు రెవెన్యూ కార్యాలయ ఉద్యోగి

తొరవ 11వ పేజీలో


# శ్రీ రాజరాజేశ్వరి అమ్మ వారి దేవస్థానం

దుర్గామిట్ట, నెల్లూరు - 4. ఫోన్ : 2322016



## శ్రీదేవి శరన్నవరాత్రోత్సవ సమాహ్వానము

(15.10.2004తేది నుండి 23.10.2004తేది వరకు)

**మహాభిషేకము :** ప్రతి సం. ఒక్కసారి మాత్రమే జరుపబడు శ్రీ అమ్మవారి మహాభిషేకము విజయదశమి పర్వ దినమున 23.10.2004తేది ఉ.4 గం.లకు జరుపబడును. పై మహాభిషేకము నందు పాల్గొనదలచిన భక్తులు రూ.150/-లు చెల్లించి తీర్థప్రసాదములు స్వీకరించి తరించ ప్రార్థన.

**శ్రీ అమ్మవారికి మ్రొక్కుబడులుగా వచ్చిన చీరలు, రవికలు**

15.10.2004 తేది నుండి 23.10.2004తేది వరకు ప్రతిరోజు ఉ.9.00 గం.ల నుండి రాత్రి 10.00 గం.ల వరకు దేవస్థానము నందు బహిరంగ వేలములో విక్రయించబడును.

## ఉత్సవ కార్యక్రమములు

15.10.2004 ఆశ్వీయుజ శుద్ధపాడ్యమి శుక్రవారం ఉ॥ గం॥3-50 నుండి 3-55లోగా కలశస్థాపన దేవస్థానం వారి ఆధ్వర్యమున నిర్వహించబడును.

| తేది/వారము | తిథి | అలంకారము | ఉభయకర్తలు |
|---|---|---|---|
| 15.10.2004 శుక్రవారం | శుద్ధ పాడ్యమి ఉదయం | శ్రీ చండీ అలంకారం | శ్రీ రావిపాటి వెంకటేశ్వరరావు గారు శ్రీమతి శాంతమ్మ గారు, పోస్టల్‌కాలనీ, నెల్లూరు. |
| | సాయంత్రం | శ్రీ భవానీ అలంకారం | శ్రీ మాగుంట సోదరులు, నెల్లూరు. |
| 16.10.2004 శనివారం | శుద్ధ తదియ | శ్రీ గాయత్రీ అలంకారం | శ్రీ అనపల్లి అశోక్ కుమార్‌రెడ్డి గారు కోవూరు. |
| 17.10.2004 ఆదివారం | శుద్ధ చవితి | శ్రీ అన్నపూర్ణా అలంకారం | శ్రీమతి దేవిరెడ్డి శైలజమ్మ గారు చెన్నై. |
| 18.10.2004 సోమవారం | శుద్ధ పంచమి | శ్రీ గజలక్ష్మీ అలంకారం | శ్రీ పొట్లపాటి ఓబులరెడ్డి గారు ఛైర్మన్ & ఎం.డి., నిప్పో, నెల్లూరు. |
| 19.10.2004 మంగళవారం | శుద్ధ షష్ఠి | శ్రీ కాళికా అలంకారం | శ్రీ చెన్నారెడ్డి సతీష్‌కుమార్ రెడ్డి గారు ఇండికేర్ మెడికల్స్ నెల్లూరు |
| 20.10.2004 బుధవారం | శుద్ధ సప్తమి | శ్రీ సరస్వతీ అలంకారం | శ్రీ బి.మధుసూదన్‌రెడ్డి గారు శ్రీమతి బి.రజనిగారు, అమెరికా. |
| 21.10.2004 గురువారం | శుద్ధ అష్టమి (దుర్గాష్టమి) | శ్రీ దుర్గా అలంకారం | శ్రీ ఆర్.వెంకట్రామానాయుడు గారు శ్రీమతి సులోచనమ్మ గారు, నెల్లూరు. |
| 22.10.2004 శుక్రవారం | శుద్ధ నవమి (మహర్నవమి) | శ్రీ మహిషాసురమర్దని అలంకారం ఉ॥8-48 నుండి ఉ॥10-25 పూర్ణాహుతి రాత్రి సువాసినీపూజ కలశ ఉద్వాసన 10.10 - 10.14లోగా | కీ॥శే॥ ఆనం అమ్మణ్ణమ్మ గారి జ్ఞాపకార్థం ఆనం గోపాలకృష్ణారెడ్డి గారు, హైదరాబాద్. |
| 23.10.2004 శనివారం | శుద్ధ దశమి (విజయ దశమి) | శ్రీ రాజరాజేశ్వరీ అలంకారం తెప్పోత్సవ, పారువేట, నగరోత్సవం | శ్రీ బెజ్జా కోదండరామిరెడ్డి గారు శ్రీమతి సులోచనమ్మ గారు, నెల్లూరు. |

**రత్నం జయరామ్**
వ్యవస్థాపకుని కుటుంబ సభ్యుడు

సదా అమ్మవారి సేవలో... భవదీయులు

**యం.సుబ్రమణ్యం రాజు**
సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి

R.O.No:A1/22/2004, Dt:9.10.2004

# నెల్లూరు ముచ్చట్లు

## చదువుల మంత్రి

రాష్ట్ర చదువుల మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ 17తేది గూడూరులో చార్మినార్ ఎక్స్‌ప్రెస్ దిగి వాకాడు వెళ్లారు. సాయంత్రం నెల్లూరు వచ్చి రాష్ట్ర మహిళా క్రీడోత్సవాల బహుమతి ప్రదానోత్సవ సభలో పాల్గొని రాత్రికి హైదరాబాద్ వెళ్లారు.

## గుప్త దానకర్ణుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

సంపన్నులు దానాలు చేయడం సర్వ సాధారణం. కానీ కుడి చేతితో చేసే దానం ఎడమ చేతికి తెలియకుండా గుట్టుగా గడిపే వారు కొందరే వుంటారు. ఏదో ఒక వ్యాపార ప్రయోజనం ఆశించో లేక ప్రతిష్టలు కాంక్షించో లేక రాజకీయంగా కానీ, సామాజికంగా కానీ పలుకుబడిని వాంఛించో దానాలు చేయడం, విరాళాలు ఇవ్వడం చూస్తూ వుంటాము మనం. అరవై రూపాయల ట్యూబ్‌లైట్ బహూకరించి, ఆరు వందల రూపాయల ఖర్చుతో బోర్డులు వేసుకునే వారు; వేలు వ్యయం చేసి పత్రికలలో ప్రకటనలు ప్రచురించే వారు చాలా మందే వున్నారు మనలో. కానీ కాంట్రాక్టర్ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి గత మూడేళ్లుగా నెల్లూరులో చేస్తున్న వితరణ కార్యక్రమాలు మాత్రం ఇందుకు భిన్నంగా సాగుతున్నాయి. పెన్నానది ఒడ్డున రోటరీక్లబ్ యాజమాన్యంలో నిర్మితమౌతున్న శ్మశాన వాటికకు 10లక్షల రూపాయలు విరాళం ఇచ్చారు ప్రభాకరరెడ్డి. కానీ ఎక్కడా ఆయన పేరు లేదు; ఒక్క పత్రికలోనూ ఆ వార్త రాలేదు. జయభారత్ హాస్పిటల్‌లో పేద రోగుల ప్రయోజనం కోసం 10లక్షలను ఖర్చు పెట్టి స్కానింగ్, కలర్ డాప్లర్ పరికరాలు కొని ఇచ్చాడాయన; కానీ ఆ విషయం రెండవ వాడికి చెప్పలేదు. నెల్లూరులో ఒక వృద్ధాశ్రమానికి మూడు లక్షల విరాళం ఇచ్చారు; ప్రచారం లేనే లేదు. రామమూర్తి నగర్లోని కరణాలమిట్ట స్కూల్ భవనాన్ని లక్షల పెట్టుబడితో పునర్నిర్మించాడు; కానీ పేరు కోరలేదు. గత మూడేళ్లుగా జిల్లా జైలులో ఖైదీలకు టివిలు, కంచాలు, గ్లాసులు బహూకరిస్తున్నారు. ఇప్పటికే ముప్పై కలర్ టెలివిజన్ సెట్లు ఇచ్చారట. మొన్న రెండవ తేది గాంధీ జయంతి సందర్భంగా కూడా నాలుగు టివిలు, కంచాలు ఇచ్చారు. ఈ బహూకరణ మాత్రం జిల్లా అధికారుల సమక్షంలో జరిగింది. అప్పుడే తెలిసింది - ప్రభాకరరెడ్డి వితరణ గుణం.

దాదాపు ముప్పయేళ్ల పాటు డబ్బు సంపాదించే యంత్రం వలె జీవితం గడిపిన వాడు ప్రభాకరరెడ్డి. ఎంత సంపాదించినా అనుభవించేది కొంతేనన్న నిజాన్ని అర్థం చేసుకున్నట్లున్నారాయన. అందువల్లే తన సంపాదనలో కొంత భాగాన్ని సామాజిక ప్రయోజనం కోసం వెచ్చించడం మంచిదనే నిర్ణయానికి వచ్చాడు. పేరు, పలుకుబడి, ప్రతిష్ట, ప్రచారం కోరకుండా ఇంతింత పెద్ద మొత్తాలు దానం చేయాలంటే ఎంతో హృదయ వైశాల్యం కావాలి. ఆయనకు మా అభినందనలు.

## మామూళ్ల వసూలులో ప్రభుత్వ ఉద్యోగులు

నెల్లూరు పట్టణంలోని పలు ప్రభుత్వ శాఖల ఉద్యోగులు దసరా మామూళ్లు ఇవ్వమని వ్యాపారస్తులు, ప్రజలపై వత్తిడి తెస్తున్నారు. విద్యుత్, టెలిఫోన్, నగరపాలక సంస్థ ఉద్యోగులు, పోలీస్‌స్టేషన్లలో దసరా మామూళ్లు ఇవ్వనిదే పనిచేయడం లేదు. ఎక్సైజ్ సిబ్బంది బ్రాందీషాపుకు 500, బారుకు వెయ్యి రూపాయల లెక్కన వసూలు చేస్తున్నారు. సేల్స్‌ట్యాక్స్, ఇన్‌కంట్యాక్స్, విజిలెన్స్ అధికారులు వ్యాపారస్తులపై పడి బలవంతపు వసూళ్లు చేస్తున్నారు.

వేలకు వేలు జీతం, రకరకాల అలవెన్సులు పొందే ప్రభుత్వ ఉద్యోగులకు ఈ మామూళ్ల కక్కుర్తి ఏమిటో?

## నక్సలైట్ల సభకు నెల్లూరీయులు

గుంటూరు జిల్లా గుత్తికొండ బిలం వద్ద జరిగిన నక్సల్స్ బహిరంగ సభకు నెల్లూరు నుంచి పీపుల్స్‌వార్, జనశక్తి పార్టీల సానుభూతి పరులు 200 మందికి పైగా హాజరయ్యారు. వీరిలో లెక్చరర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, న్యాయవాదులున్నారు. జనశక్తి నాయకుడు, నెల్లూరీయుడు రియాజ్‌ను ఆయన సన్నిహితులు పలువురు పలకరించి వచ్చారు.

## హంతకుడైన స్నేహితుడు

వివాహేతర సంబంధం కారణంగా ఇద్దరు స్నేహితుల మధ్య ఏర్పడిన మనస్పర్థలు దారుణ హత్యకు దారితీశాయి. నెల్లూరు భక్తవత్సలనగర్‌కు చెందిన వెంకట ఉపేంద్ర(32)కు కళ్యాణ్‌నగర్‌కు చెందిన ఒక యువతితో అక్రమ సంబంధం వుంటుంది. ఈ యువతిని ఉపేంద్ర స్నేహితుడు కుమార్ పెళ్లి చేసుకోవాలనుకొన్నాడు. ఒకానొక దశలో ఇద్దరి మధ్య అక్రమ సంబంధాన్ని పసిగట్టిన కుమార్, ఉపేంద్రను 9తేది అతని షాపు నుంచి తీసుకెళ్లి, ఆమంచర్ల సమీపంలోని చిట్టడవిలో పీకల వరకు తాగించి, దారుణంగా పొడిచిచంపాడు. 13తేది కుమార్ స్వయంగా నెల్లూరు రూరల్ పోలీసుల ఎదుట లొంగిపోవడంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా వివాహేతర సంబంధాల మూలంగా స్త్రీ, పురుషుల హత్యలు మిగతా హత్యల కంటే పెచ్చు పెరగడం విశేషం.

## ఉమెన్స్ హాస్టల్‌లో ఆత్మహత్య

ప్రేమ విఫలం కావడంతో విశాఖపట్నానికి చెందిన ఒక యువతి దర్గామిట్టలోని ఉమెన్స్ హాస్టల్‌లో 13తేది ఆత్మహత్య చేసుకొంది. శ్రీలక్ష్మి, నెల్లూరీయుడు రమణయ్యను ప్రేమించింది. వీరి ప్రేమ వ్యవహారం పెద్దలకు ఇష్టం లేదు. శ్రీలక్ష్మి, బ్యాంక్ అకౌంట్‌లో వుండిన 25వేల రూపాయలను ఆమె తల్లితండ్రులు డ్రా చేసుకోవడం, ప్రియునితో ఘర్షణ ఆమెను ఆత్మహత్య చేసుకునేలా చేశాయి.

## నిత్యావసర వస్తువుల ధరలకు రెక్కలు

నెల్లూరు టౌన్‌లో గత కొన్ని రోజులుగా నిత్యావసర వస్తువుల ధరలకు రెక్కలు రావడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు అల్లాడి పోతున్నారు. కిలో 30 రూపాయలు అమ్మే చింతపండు 69 రూపాయలు, 12 రూపాయలమ్మే చక్కెర 22, 25 రూపాయలమ్మే కందిపప్పు 37, 34 రూపాయలమ్మే వేరుశనగ నూనె 49 రూపాయలు, ఎండుమిర్చి 32 రూపాయల నుంచి 44 రూపాయలకు చేరుకొన్నాయి. ధరల నియంత్రణకు అధికారులు, పాలకులు చిన్నపాటి ప్రయత్నం కూడా చేయక పోవడం దారుణం.

## గ్రంథావిష్కరణ సభలు

17తేది టౌన్‌హాల్‌లో సత్యానంద మహర్షి 8వ పుణ్య ఆరాధన, శ్రీరామాయణ తరంగిణి గ్రంథావిష్కరణ సభ జరుగుతుంది. సత్యానంద మహర్షి సేవా సమితి నేతృత్వంలో ఈ కార్యక్రమం జరుగుతుంది.

***

నృసింహ దర్శనం, వేదాంత శబ్దార్థ దీపిక ఆవిష్కరణ సభ 18తేది టౌన్‌హాల్‌లో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎల్.బి.శంకరరావు, బండి నాగరాజు, రామచంద్రప్రసాద్, గాదిరాజు సుబ్రహ్మణ్యం, డాక్టర్ టి.వి.సుబ్బారావు, డాక్టర్ కె.వి.రాఘవాచారి, కవి వేంకట బాలకృష్ణారెడ్డి, కర్రా సుందరరామయ్య పాల్గొంటారు. సాహిత్యాభిమానులను ఈ కార్యక్రమానికి తరలి రమ్మంటున్నారు నిర్వాహకులు.

## కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దసరా

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో దసరా ఉత్సవాలు 14తేది మొదలయ్యాయి. 16తేది అన్నపూర్ణ, 17తేది ధనలక్ష్మి, 18తేది గాయత్రి , 19తేది రాజరాజేశ్వరి, 20తేది సరస్వతి, 21తేది మహిషాసుర మర్ధని, 22తేది గజలక్ష్మి అలంకారాలు చేస్తారు. 22తేది ప్రత్యేకంగా కన్నెపూజ, 23తేది శమీపూజ, 24తేది వసంతోత్సవం జరుగుతాయని దేవస్థానం ఛైర్మన్ గుండ్లవల్లి సుధాకర్‌రావు చెప్పారు.

## సణుగుడు

2వ పేజీ కొరవ

నడిపిస్తున్నారు. షేర్‌మార్కెట్లు, ఫ్యాషన్ షోలు, ప్రపంచబ్యాంకు అప్పులు, ఉన్నవారి విలాసాలు, లేనివారి ఆకలి విలాపాలు సర్వసాధారణమై పోయాయి చైనాలో.

రష్యా, చైనాలలో సాధ్యం కాని సామ్యవాద సమాజ సత్ఫలితాలను ఇక్కడ వీరేమి సాధించగలరు చెప్పండి? వారే చెప్పిన 37 సంవత్సరాల అవిశ్రాంత పోరాటంలో వారు సాధించింది ఏమిటి? ఇంతటి సువిశాల దేశంలో ఒక్క అంగుళం భూమి మీద వారి విప్లవ రాజ్యం ఏర్పడిందా? మరొక ముప్పై ఏడేళ్లు ఇదే రీతిలో పోరాటం చేసినా అది జరిగే పనేనా? రోజు రోజుకూ మారుతున్న ప్రజా జీవన శైలి; ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రజల జీవితాలపై చూపుతున్న ప్రభావం; ప్రభుత్వాల అపరిమిత ఆయుధ సంపత్తి వంటివి పరిగణనలోకి తీసుకుని చూస్తే వీరు విన్పించే దున్నే వారికే భూమి వంటి నినాదాలు పిచ్చి వాడి ప్రేలాపనలుగా కన్పించడంలో విచిత్రం ఏమైనా వుందా? విప్లవం సాధ్యమయ్యే పరిస్థితులు వున్నాయని వీరు సోదాహరణంగా నిరూపించగలరా? వీలుకాని పని వీలౌతుందని వెర్రిగా నమ్మే పదిమంది విప్లవకారుల కోసం నూరు కోట్ల మంది భారత ప్రజానీకం రాజ్య హింస, ప్రతిహింసలతో ప్రత్యక్ష నరకం చవిచూడవలసి రావడం ఎంత వరకు న్యాయం? ప్రజలకు ఎందుకీ శిక్ష?

తమ గురించి ఏమి చెప్పదలచుకున్నా ప్రజలు, ప్రజలు అని పలవరిస్తున్నారు నక్సల్ నేతలు. వారి దృష్టిలో ప్రజలు అంటే ఎవరు? నక్సల్ సంస్థలన్నీ కలిసి ఎన్నికల బహిష్కరణ పిలుపి నేసి ఓటు వేసి ప్రజాస్వామిక ప్రభుత్వాలను గెలిపించుకుంటున్న ఓటర్లు ప్రజలు కారా? చైనా, రష్యాలలో విప్లవ కాలంలో వున్నవి ప్రజా ప్రభుత్వాలు కావు. చక్రవర్తులు, రాజులు, జమీందారుల ఫ్యూడల్ రాజ్యం. అందువల్ల అక్కడి ప్రజలు ఆనాటి విప్లవకారులతో చేతులు కలిపారు. కానీ మనకున్నది ప్రజా ప్రభుత్వం. ప్రజలలోని వారు ఒక్కొక్కరుగా ఒక్కొక్క ఓటు వేసి గెలిపిస్తున్న ప్రభుత్వం. ఇన్ని కోట్ల మంది ఓటర్లు ఎప్పుడైనా ఒక్కసారి అయినా నక్సల్ పిలుపులకు ప్రతిస్పందించి ఓటు వేయడం మానివేశారా? గతంలో కాశ్మీర్ తీవ్రవాదుల పట్ల ప్రజలలో సానుభూతి వున్నప్పుడు వారి పిలుపు మేరకు ఆ రాష్ట్రం మొత్తం ఎన్నికల బహిష్కరణ పాటించింది; ఆ తర్వాత ఆ తీవ్రవాదులపై నమ్మకం నశించి, వారెన్ని తుపాకులు చూపి బెదిరించినా ప్రజలు వీధులలోకి వచ్చి ఓటు చేశారు. ప్రజా మద్దతు, ప్రజా వ్యతిరేకతలకు ప్రత్యక్ష తార్కాణం అది. అటువంటి సాదృశ్యం ఒక్కటైనా నక్సలైట్లు చూపగలరా? ఏ సందర్భంలో, ఏ అంశంపై ప్రజలు వారివెంట నడిచారు? నడుస్తున్నారు? తుపాకి చూపి అడవులలోని అమాయక ఆదివాసీలను లోబరచుకుని వారు పెట్టే అన్నం తింటూ, వారు కల్పించే ఆశ్రయం పొందుతూ అదే ప్రజల మద్దతు అంటే కుదురుతుందా?

37ఏళ్లుగా నక్సల్స్ ప్రభావం కల్గిన గ్రామాలలో కూడా ఈనాటికీ మూఢ విశ్వాసాలు, మాట చాదస్తాలు, వరకట్న వేధింపులు, మహిళలపై అత్యాచారాలు, వ్యాపారుల దోపిడీ, చిట్‌ఫండ్ మోసాలు, నకిలీ నోట్ల దగా ఎందుకు వున్నాయి? తమ విప్లవ భావనల ప్రభావం నిజంగా ప్రజలపై ప్రసరించి వుంటే ఇటువంటి సాంఘిక, ఆర్థిక దురాచారాలు, అత్యాచారాలు కనీసం ఆయా ప్రాంతాలలోనైనా సమసి పోవాలి కదా? ఆ విషయంలో నక్సలైట్లు ఎందుకు విఫలమౌతున్నారు?

సంపన్న వర్గాల దోపిడీని నివారించే శక్తి వీరికే వుంటే నక్సల్ ప్రభావిత ప్రాంతాలలో కూడా కాంట్రాక్టర్లు, వ్యాపారులు ప్రజా ధనాన్ని ఎట్లా దోచుకోగలుగుతున్నారు? ఆ కాంట్రాక్టర్ల నుంచి వీరెట్లా విరాళాలు స్వీకరిస్తున్నారు? కనీసం తమ ప్రభావిత ప్రాంతాలలో ప్రభుత్వ కార్యాలయాల అవినీతిని ఎందుకు నివారించలేక పోతున్నారు? ఒక్క అధి కారి కూడా వారిని చూసి నేర్చుకుని, ప్రభావితమై, లేదా భయపడి అవినీతిని మానుకున్న సాదృశ్యం వుందా? పోనీ - ఒక్క ప్రాంతంలోనైనా ప్రజలు నక్సల్స్ ఉద్యమ ప్రభావంతో అవినీతిపరులైన అధికారుల మీద తిరగబడి సరిదిద్దిన సాదృశ్యం వుందా?

సమాజంలోని ఏ చెడును, ఏ తప్పును సవరించగలిగారు ఇన్నేళ్ల పోరాటం ద్వారా నక్సలైట్లు? వారిని ఇంకా ప్రజలు ఎందుకు నమ్మాలి? వారి మాటల వలలో పడి తమ ప్రాణాలు ఎందుకు కోల్పోవాలి?

జమీన్‌రైతు
వెంకటరమణ విలాస్ మిద్దెపై, పొగతోట, నెల్లూరు. ఫోన్: 2327354
చందా
సంవత్సరానికి రూ.150లు


# చందనలో దసరా, దీపావళి ఉత్సవ్

దసరా, దీపావళి పండుగల సందర్భంగా చందన బ్రదర్స్ కస్టమర్ దేవుళ్లకు అన్ని రకాల వస్త్రాలపై డబుల్ తగ్గింపు



విశేషమైన సీజన్ ఆఫర్
భారతదేశంలో అన్ని ప్రాంతాలకు చెందిన జైపూర్, పానిపట్, మీరట్, ఢిల్లీ, బొంబాయి, అహ్మదాబాద్, మోడీనగర్, ఈరోడ్, రాంపూర్ మొ॥ అద్భుతమైన డిజైన్లు, అత్యంత మన్నిక చెందిన బెడ్‌షీట్స్, మెగా అత్యద్భుత తగ్గింపు

- పట్టు, ఫ్యాన్సీ, వర్క్ సింథటిక్, కాటన్, హ్యాండ్‌లూమ్ చీరలు.
- పంజాబీ డ్రస్సెస్, గాగ్రాచోళీలు.
- సూటింగ్స్ - షర్టింగ్స్
- కిడ్స్ & చిల్డ్రన్స్‌వేర్
- రెడీమేడ్స్

అన్ని రకాల రెడీమేడ్స్‌పై అద్భుత తగ్గింపు
ప్రముఖ కంపెనీలు, ఎక్కడా లభించని వెరైటీలు, ఎన్నడూ చూడని ధరలు.

చందన బ్రదర్స్
G.T. రోడ్
నెల్లూరు

## హోం మంత్రి

మొదటి పేజీ తరువాయి

జాగ్రత్త పడి వారికి దూరం జరిగారు. పత్రికలో వార్తలు రావడం వల్ల నెల్లూరులో వారి మోసం సాగలేదు. దానితో ఆ మోసగాళ్ల ముఠా తెలంగాణా మీద పడింది. నేరుగా హోంమంత్రి జానారెడ్డి వద్దకే వెళ్లి, ఉచితంగా ఇళ్లు కట్టిస్తామని నమ్మబలికి, ఆయన నుంచి లిఖిత పూర్వకంగా ఒక జాబు తీసుకున్నారట. ఆ జాబు చూపించి తెలంగాణా జిల్లాలలో అమాయకులను నమ్మించి, కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారు. ఇది జానారెడ్డి గారికి తెలిసింది. ఆయన స్థానంలో వేరెవరు హోంమంత్రిగా వుండినా తన పేరు చెప్పి ప్రజలను దోచుకుంటున్న ముఠాను పోలీసులకు అప్పచెప్పి; కఠినంగా చర్య తీసుకునేవారు. కానీ జానారెడ్డి గారి తలకాయలో మెదడుకు బదులు మట్టి ముద్ద మాత్రమే వున్నట్లుంది. నాపేరుతో ఒక ముఠా మోసాలు చేస్తున్నది, జాగ్రత్తగా వుండండి అని ప్రజలకు పత్రికా ముఖంగా హెచ్చరిక జారీ చేశారాయన. అంతటితో ఆగినా బాగుండేది; మోలిన్ మిషన్ చర్చి నిర్వాహకులు తన నుంచి తీసుకున్న జాబును తనకు తిరిగి ఇవ్వాలని ఒక విజ్ఞప్తి కూడా చేశాడు. ఎంత సిగ్గుమాలిన ప్రకటన ఇది? ఒక హోం మంత్రి స్థాయిలోని వ్యక్తి చేయవలసిన పనేనా ఇది? తన పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టే శక్తి కూడా లేని బలహీనుడు ఆ పదవికి అనర్హుడు. అటువంటి దౌర్బల్యం కల్గిన వ్యక్తి చేతిలో నక్సల్స్‌తో చర్చల వంటి రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడి వున్న సమస్యను పెట్టి రాజశేఖరరెడ్డి చాలా పెద్ద తప్పు చేశాడేమోనన్పిస్తున్నది.

## చర్చలు

మొదటి పేజీ తరువాయి

మీ భూములు మాకు పంచి పెట్టండి; అన్నలు రంగంలోకి దిగితే చాలా ఇబ్బందులు పడవలసి వస్తుంది అని హెచ్చరికలు జారీ చేశారట. వినుకొండ ప్రాంతాలలో నేరుగా రైతుల భూముల మీద పంచాయతీలు జరుగుతున్నాయి. ఒక్కొక్క రైతుకు కేవలం ఐదెకరాలు మాత్రమే వుంటే చాలునని; తతిమా భూమిని పేదలకు రిజిష్టర్ చేసి మరీ ఇవ్వాలని ఈ పంచాయతీలలో చెప్తున్నారట. ఈ సంఘటనలు వేటి పట్లా పోలీసులు స్పందన చూపడం లేదు. మీ సమస్యలు ఏమైనా వుంటే ప్రభుత్వానికి వెళ్లి చెప్పుకోండి అని తిప్పి పంపేస్తున్నారట. రైతులు, సాధారణ ప్రజలు నక్సల్స్ మీద పోలీసుస్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేయడానికి కూడా భయపడుతున్నారు.

చర్చల పేరుతో ప్రభుత్వం ఇదే తీరులో నక్సలైట్లకు సాగిల పడితే మాత్రం రాష్ట్రంలో సాధారణ ప్రజానీకం జీవన భద్రత కోల్పోయే ప్రమాదం కన్పిస్తున్నది.

## నక్సల్ సైనికులు

మొదటి పేజీ తరువాయి

వుండవచ్చు. నక్సలైట్లు ఇటువంటి యువతీ, యువకులతో సుశిక్షితమైన మిలిటరీ బలగాన్ని నిర్మించుకుంటే - దాన్ని ఎదుర్కోవడం మన పోలీసులకు

నిజం. రానున్న భవిష్యత్తులో నక్సల్ అణిచివేత మొదలు పెట్టదలిస్తే సరిహద్దు భద్రతా దళం వంటి పారా మిలిటరీ సిబ్బందిని వినియోగించ వలసిందే తప్ప - సాధారణ పోలీసులకు అలివి కాదు. ఆంధ్రప్రదేశ్ కూడా శ్రీలంకలోని జాఫ్నా వలె తయారు కావడం ఖాయం అన్పిస్తున్నది.

## ముఖ్యమంత్రి

మొదటి పేజీ తరువాయి

లని కేంద్రం సూచన చేసింది. చర్చల పేరిట కనీసం ఒకటి రెండేళ్ల పాటు హింసకు దూరంగా వుంచే ప్రయత్నం చేయాలన్న ఆలోచనలో వుండిన ముఖ్యమంత్రికి ఇదొక పెద్ద షాక్ క్రింద లెక్క. ఒక్క దఫాలో చర్చలు ముగించేందుకు నక్సలైట్లు సిద్ధంగా లేరు. కనీసం ఆరేడు నెలలైనా ఈ నాటకం ఆడాలన్నది వారి వ్యూహం. ప్రభుత్వం కేంద్రం సూచన పాటిస్తుందో లేక నక్సల్స్ వత్తిడికే లొంగిపోతుందో వేచి చూడవలసిందే.

## నిధుల స్వాహా

5వ పేజీ తరువాయి

కటరుకు వివరాలు పంపుతామని అధికారులు వేధిస్తున్నారని కళ్లనీళ్ల పర్యంతమైనారు. రాష్ట్ర, జిల్లా అధికారులు వచ్చినప్పుడు మా గోడును విన్పించు కొందామన్నా ఆ అధికారి తమ గొంతు నొక్కేస్తుందని తెలిపారు. భర్తలను, పిల్లలను వదలి 24 గంటలు చాకిరీ చేస్తున్నా ఆ కాగితాలు రాయాలి, ఆఫీసులో పనుందని నానా చాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నా మొదలయ్యే వరకు సిడిపిఓ ఆఫీసులోనే వుండి టీచర్లు ధర్నా అనగానే బయట పనుందని వెళ్లడం విశేషం. జిల్లా అధికారులు స్పందించి అంగన్ వాడీల సమస్యలను పరిష్కరించి, బుచ్చి సిడిపిఓ పని తీరుపై విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## ఉద్యమించనున్న వరకవిపూడి రైతులు

తోటపల్లి గూడూరు మండలం వరకవిపూడి రైతులు తమ చెరువు ఆక్రమణలను తొలగించాలని కోరుతూ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. 1000 ఎకరాల విస్తీర్ణంలో వున్న ఈ చెరువులో అధిక భాగం ఆక్రమణలకు గురై ఆయకట్టు కింద గల 2వేల ఎకరాల మాగాణి భూములు బీడు పెట్టుకొని 3వేల మంది రైతులు వరిసాగుకు స్వస్తి పలికి కూలి పనులకు వలసలు పోయారు. చెరువులో అక్రమంగా విద్యుత్ కనెక్షన్లతో సేద్యాలు చేసి ఫలితాలు పొందుతుంటే పట్టా పొలాలున్న ఆయకట్టు రైతులు చిట్టెడు గింజలు పండించలేక పోతున్నామంటున్నారు. చాలా సంవత్సరాల నుంచి రైతుల మొర ఆలకించే నాథుడు లేడు. చెరువుల ఆక్రమణలు చాలా తేలికైన పనిగా మారింది. పెద్దగా ఖర్చులు లేకుండా లాభసాటి ఆదాయంగా మారింది. తమ స్వంత ఆస్తులతో పాటు వీటిని రక్షించుకొంటున్నారు. చెర్లోకి కొద్ది నీళ్లు వచ్చినా అవి కిందికి దిగకుండా మాదుడులో వీరి తెలివితేటలు అమోఘం. వెల్లువలొస్తే సముద్రానికి నీరు వదిలేయ



గాంధీ జయంతి సందర్భంగా నెల్లూరు సెంట్రల్ జైలులోని ఖైదీలకు కలర్ టెలివిజన్‌లు, కంచాలు బహూకరించిన సభలో దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో ఎస్పీ శివధర్‌రెడ్డి, కలెక్టర్ రాజశేఖర్.

డంలో కడు దిట్టలు. శిస్తులు కడుతూ, పక్కా పట్టాలు పొలాలున్న చెరువు సాగు క్రింద గల రైతులు అప్పుల ఊబిలో, కరెంటు బిల్లులు కట్టలేక ఒకవైపు ఆత్మహత్యలు చేసుకుంటున్నా అధికారులలో చలనం లేదు. కోడూరు, ఈదూరు చెరువు పరిస్థితి కూడా ఇదే విధంగా వుంది. కొంతకాలం కోడూరు చెరువుపై రైతులు దడబడలు చేసి చతికిలబడ్డారు. రైతులు నిమ్మకు నీరెత్తినట్లు చలనం లేకపోతే మారిన రాజకీయ పరిస్థితులలో వరకవిపూడి, కోడూరు, ఈదూరు చెరువుల్లో ఆక్రమణదార్లకు పట్టాలు ఇచ్చేసినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. ఇప్పటికే ఈ చెరువుల్లో బలవంతులు దర్జాగా పొలాలు చేసి అమ్ముకొంటున్నారు. వరకవిపూడి రైతాంగం మూకుమ్మడిగా వెళ్లి సోమవారం ఇరిగేషన్ అధికారులకు మెమోరాండం ఇచ్చింది. అధికారులు ఏంజేస్తారో చూడాల్సి వుంది.

## నరుకూరు సెంటర్లో ట్రాఫిక్ జామ్

నరుకూరు సెంటర్లో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఇక్కడ వ్యాపారం చేసేవారు, మెకానిక్ షెడ్ల నిర్వాహకులు వాహనాల మరమ్మత్తులు నడిరోడ్లో చేస్తుంటారు. దీనికి తోడు కోడూరు, టిపిగూడూరు, ఈదూరు వైపు వెళ్లే వాహనాల రాకపోకలు ఆలస్యమౌతున్నాయి. బీచ్‌కు వెళ్లే వాహనాలు క్రమబద్ధీకరణ లేకపోవడంతో ద్విచక్ర వాహనాలపై త్రాగుబోతులు చేతులు వదిలేసి ముగ్గురేసి చొప్పున ప్రయాణిస్తూ ప్రయాణీకులను హడలెత్తించేస్తున్నారు. ట్రాఫిక్ పాయింటు లేకపోవడంతో ఫిర్యాదులు చేయడానికి 10, 12 కిలోమీటర్లలో వున్న తోటపల్లిగూడూరు, నెల్లూరు పోవాల్సి వస్తుంది. నెల్లూరు రూరల్, తోటపల్లిగూడూరు పోలీసులు ట్రాఫిక్ నియంత్రణల్లో శ్రద్ధ చూపడం లేదు. గతంలో ఎస్పీగా పని చేసిన శ్రీనివాసరెడ్డి నరుకూరులో ట్రాఫిక్ పాయింటు పెట్టమన్న ఆదేశాలు నేటికి అమలుకు నోచుకోలేదు.


శ్రద్ధాంజలి



వల్లూరు వెంకయ్య నాయుడు గారు

రాముడుపాళెం (1927 - 2004)

సహనశీలి, అమృతమూర్తి, నిరంతరం తన వారి యొక్క శ్రేయస్సును ఆకాంక్షించే

**వల్లూరు వెంకయ్య నాయుడు గారు**

తేది 6-10-2004, బుధవారం స్వర్గస్తులైనారు. వారి మరణం మాకు తీరని లోటు. వారి ఆత్మకు చిరశాంతిని కలుగజేయమని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

**భార్య : రంగమ్మ**

కుమారులు - కోడళ్ళు :
వల్లూరు రామమోహన్ - కళావతి
వల్లూరు వేణుగోపాల్ - సుజాత

మనుమరాళ్ళు :
సుష్మాకాత్యాయని - M.శ్రీకాంత్(U.S.A.)
సాహితిమిత్రవింద,
నందిని

కుమార్తెలు - అల్లుళ్ళు :
వసంతమ్మ - అవయముఖారి దొరస్వామిరావు
సుదర్శనమ్మ - చిగురువాడ పద్మనాభం
విజయమ్మ - మోపూరు పెంచలయ్య
సువర్చల (లక్ష్మి) - తూపిలి కరుణకుమార్
నీరజ - తోపుగుంట పెంచలనరసయ్య

అక్కలు :
మోపూరు శేషమ్మ
మోపూరు రామలక్ష్మమ్మ
చెల్లెలు : వల్లూరు సరోజనమ్మ

మేనల్లుళ్ళు :
మోపూరు వేణుగోపాలయ్య,
మోపూరు పెంచలయ్య, వల్లూరు ప్రేమకుమార్,
వల్లూరు బోయనభాస్కర్, తోటపల్లి నాగేశ్వరరావు

# దిక్ దోషారిష్ట

ఐ.లక్ష్మీరమణ నెల్లూరు

* ఇంటిలో ఉత్తరం, తూర్పు హద్దు నిర్మాణాలున్నాయి. పైగా స్థలాల విషయంలో కూడా పేచీ వుంది. ప్లాను పంపిస్తున్నాను.

దీన్నే 'దిక్‌దోషారిష్ట' అంటారు. ఇందువల్ల ఆర్థిక అనారోగ్య బాధలెక్కువ. ఇవి పప్పులవీధి, నవాబుపేట, స్టోన్‌హౌస్ పేట, కొరడావీధుల్లో ఎక్కువ. మీరు వాస్తును సరిచేసుకోలేరు. అంచేత 'యంత్ర' ప్రతిష్టాపన చేసుకోక తప్పదు.

టి.మాణిక్యరావు కోవూరు

* 'అష్టభుజకోణ దోషం' అన్నారు. అంటే ఏమిటి? ఎలా నివారించుకోవాలి?

ఇంటికి అష్టభుజాలుండి, ఈశాన్యం వీధి చూపుండి, మూడు రోడ్ల కూడలి స్థానంలో వున్న అంశాన్ని పైదోషంగా పేర్కొంటాము. ఇవి ఎస్పీ ఆఫీసు

**వాస్తు సందేహాలు-సమాధానాలు**

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
ఫోన్ : 2338159

4వ వీధి, గాయత్రినగర్,
ఎ.కె.నగర్ పోస్టు, నెల్లూరు - 4

వెనుకా, అష్టలక్ష్మి గణపతి ఆలయం దగ్గరా, నెల్లూర్లోనూ, పాటూరులోనూ, మీ వూళ్లో సినిమా హాలు, బజారు వీధుల్లోనూ వున్నాయి. నివారణ 'విపులంభ' దృష్టి యంత్ర ప్రతిష్టాపన.

పి.ప్రసూనలక్ష్మి నెల్లూరు

* ఇంతకు ముందు దక్షిణం వైపు ఇల్లు మావి. ఇప్పుడు ఉత్తరం రోడ్డు ఏర్పడింది. అంచేత ఉత్తరం గేటు ఏర్పాటు చేసుకున్నాము. ఏమైనా అభ్యంతరమా?

అలా ఉత్తరం గేటు పెట్టుకున్నపుడు బాహ్యవాస్తు మారుతుంది కదా? అంచేత చూపించి సరిచేసుకోవడం మంచిది. ఎందుకంటే దక్షిణం(యమ) స్థానాన్ని విడిచినప్పుడు చాలా జాగ్రత్తగా వాస్తు చూపించుకోవాలి.

జి.నిరంజనరావు రాపూరు


* రాపూరు, సైదాపురం, పొదలకూరు గ్రామాలు అభివృద్ధి చెందక పోవడానికి వాస్తు పరంగా దోషాలున్నాయంటున్నారు. పరిష్కార మార్గాలేమిటి?

గ్రామ వాస్తు దోషాలే కారణం. రాపూరుకు ఈశాన్యంలో, దక్షిణంలో శ్మశాన వాటికలు, పొదలకూరుకు వాయువ్యంలో చెరువులు, సైదాపురానికి గ్రామ వాస్తు దోషం ఇందుకు కారణాలు.

## దేవుళ్లకూ కష్టాలే

5వ పేజీ తరువాయి

ఎండోమెంటు వారు వేలం పాటలు నిర్వహించగా పార్లపల్లి గ్రామస్తులు వేలం పాడి మరికొన్నాళ్లు ఈ భూములను కౌలుకు చేశారు. కాలగర్భంలో వారు మళ్లీ ఈ భూములను వదిలేయకుండా విడవలూరు గ్రామానికి చెందిన ఉప్పలమర్తి మల్లికార్జునరెడ్డి అనే వ్యక్తి అతి తక్కువ లీజుకు 22పుట్ల ధాన్యానికి దీన్ని దక్కించుకున్నారు. ఈయన హయాంలో పొలాలు సిరులు పండించాయి. సమీపాన వున్న మలిదేవివాగుకు ఎత్తిపోతల పథకాలు పెట్టి పొలాలను చక్కగా చదును చేసి ఈ పొలాలను బాగా పండేలా చేశారు. ఆ తర్వాత ఈయన ఇచ్చే లీజు స్వల్పంగా వుందనే వాదన రాగా మళ్లీ ఎనిమిది పుట్లు అధికంగా ఇస్తూ ఆయనే లీజుకు చేసేవారు. ఈ క్రమంలో 1998 సంవత్సరం ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన పూండ్ల శ్రీనివాసులు, పొంతగాని వెంకట రమణయ్య అనేవారు గ్రామ పేదలతో కలిసి భూపోరాటం చేశారు. ఈ భూములను పక్క వూరు భూస్వామి వచ్చి కౌలుకు చేయడమేమిటి, గ్రామంలోని పేదలంతా కలిసి కౌలు పాడుకొంటాం, సాగు చేసుకొంటాం, లీజు చెల్లిస్తాం అంటూ నినాదం లేవదీసి మల్లికార్జునరెడ్డి సాగును తరచూ అడ్డుకునేందుకు పోరాటం మొదలెట్టారు. రాజకీయాలు ప్రవేశించాయి. భూముల వేలం ప్రతిసారీ ఏదో విధంగా వాయిదా పడుతూనే వుంది. పాపం దేవుళ్లు కష్టాల్లో పడ్డారు.



నెల్లూరు ఎమ్మార్వో కార్యాలయంలో ప్రజావిజ్ఞప్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి.

## కార్ల దొంగలు

5వ పేజీ తరువాయి

చేయలేదు, విచారణ కోసం తీసుకొచ్చామంటున్నారు పోలీసులు. అలాగే మీడియా సృష్టించిన విధంగా అతను దొంగకాదని ఒక పోలీసు అధికారి చెప్పడం విశేషం. ఈ ఆదినారాయణకి ఎవరు అధికారంలో వుంటే వారి వెనుక తిరగడం అలవాటు. మొదట్నుంచి కూడా ఇతను తోటపల్లిగూడూరు, ఇందుకూరు పేట మండలాలకు చెందిన ఇద్దరు బ్రోకర్లతో సంబంధాలు ఏర్పాటు చేసుకొని దొంగతనంగా తెచ్చిన కార్లను నెల్లూరు లోని ఒక షెడ్‌లో నెంబరుప్లేట్లు, రంగు మార్చి, దొంగపత్రాలు సృష్టించి, ఇతరులకు అమ్మేవాడని సమాచారం. ఈ విషయంలో పోలీసులు ముందు అతిగా స్పందించి ఆ తర్వాత చేతికి దొరికిన వాడిని వదలివేయడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎస్పీ గారు ఈ విషయమై ప్రత్యేక దృష్టి పెడితే పలు దొంగకార్లు బయటకొచ్చే అవకాశం వుంది.



రాపూరు నియోజకవర్గ పరిధిలోనికి వచ్చే నెల్లూరు పట్టణంలోని 22వ వార్డులో ప్రజా సమస్యలపై వినతి పత్రాలు స్వీకరిస్తున్న రాపూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి.

# సరికొత్త కవిత్వ సప్తపది! కవిత 'నది'!!

సరిక్రొత్త 'సింబలిజం'తో ఆశా, నిరాశల మధ్య ఉత్తమ కవిత్వ వీచికలతో పాఠకుల్ని సేదతీర్చే కవితా సంపుటి కె.ఎస్.రమణ 'నది' కావ్య సంపుటి.

రమణపైన 'చలం' ప్రభావం తీవ్రంగా వుంది. ఇతని శైలీ విచిత్రం. అక్షర విన్యాసం ఏమిటంటే చలంలాగా రెండో కాపిటల్ లెటర్స్ వాడటం, ఒక అంశాన్ని కవిత్వీకరించడంలో సింబాలిజం (ప్రతీకవాదం) ఆశ్రయించడం!

రమణ అదృష్టవశాత్తూ సుప్రసిద్ధ కథా రచయిత కె.సభా, ఆధ్యాత్మిక శక్తి శ్రీవల్లీదేవి దంపతులకు జన్మించాడు. సహజంగా సభా చలం శిష్యుడు. రమణ కూడా చలం, సౌరీస్, నర్తకి, పకపక, చంపక (వీళ్లంతా చలం, రమణ మహర్షి ఆశ్రమంలో చలంతో అనుబంధం వున్న వాళ్లు).

అంచేత రమణలో ఆస్తికత్వం, ఆధ్యాత్మిక స్థితి, అభ్యుదయ దృక్పథం పుష్కలంగా వున్నాయి. తొలి కవిత అనుభవంలో -

*"తొలి రెక్కల రేకుల*
*తొలకరి నవ్వులతో, కేరింతలతో*
*ఆటలతో*
*తుళ్లింతల నా బాల్యాన్ని*
*వాత్సల్యంగా నిమిరిన నా బాల్యాన్ని*
*పై ప్రభావాల వల్లే అనగలిగాడు."*

రమణలో ఆశ, నిరాశలు సమపాళ్లలోనే కన్పిస్తాయి. చలం ప్రభావం ఇతనిలో ఆశావాదాన్ని రేపినా, అభ్యుదయ దృక్పథం, సమకాలీన, సామాజిక సమస్యలూ ఇతనిపై నిరాశావాదాన్ని ముద్రవేశాయి. అంచేత 'నిశి' కవుల్లో చేరి చీకటి తరగలు(1980), తమోనలం (1981) వారితో కలిసి కవితా సంపుటిలు వెలువరించారు.

పద చిత్రీకరణలో రమణ అందె వేసిన చేయి. వెన్నెలను చూడండి ఎలా వర్ణిస్తాడో 'అపేక్షగా, దయగా, ప్రేమగా, కురిసే వెన్నెల చూపులు"-

ఇతను కవిత్వ శిల్ప చిత్రీకరణలో దిట్ట ప్రయోగశీలి కూడా! చూడండి-

*"నీలి సరస్సులో*
*వెన్నపువ్వు పరిమళించి*
*మత్తెక్కి*
*తలారా స్నానిద్దామని*
*విస్కీ సీసాలోకి దూకేశాను"*

చిన్నప్పటి నుంచి బాధల చీకటిలో, సమస్యల కంచెల మధ్య పెరిగిన వాడు కాబట్టి జీవితాన్ని చక్కగా విశ్లేషించాడు.

*"యేమనుకున్నావ్ తమ్ముడూ!*
*యిక్కడ జీవితమంటే*
*ఒక నిట్టూర్పు, నెత్తుటి బొట్టు*
*ఒక విచ్చుతున్న మంటల పువ్వు"*

ఎంత వద్దనుకున్నా, ఇతని కవిత్వంలో ప్రతీకవాదం ఎక్కువగానే కన్పిస్తుంది.

> **పుస్తక సమీక్ష**
> నది(కావ్యం)
> రచయిత
> కె.ఎస్.రమణ
> సమీక్షకులు
> పాయసం సుబ్రహ్మణ్య మహర్షి
> ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ -1
> పేజీలు :124, వెల: రూ. 35/-

*"సూర్యుడా*
*వాడి వూనెత్తరు*
*నానప్పు కళేబరాల చితులమీద*
*రోజూ కసిగా, నాట్యం చేస్తాడు!"*

బతుకు ఊసెత్తితే రమణలో నిరాశావాదం కన్పిస్తుంది.

*"కాలిపోయిన కలల బూడిని*
*కెలికి ప్రయోజనం లేదు-"*

*"యేకాంతం శిలువ మీద*
*రక్తాశ్రువులతో నేను*
*గాయపడ్డ ఆకాశం పెదిమలపై దగ్ధ*
*గీతం నేనే!"*

అంటాడు ఒక దశలో-

అయితే నిరాశావాదమే గాక ఆశావాదం కూడా కవిత్వంలో అక్కడక్కడా కన్పిస్తుంది.

*"కిరణాల యాత్రలో వివరగా*
*తప్పిపోయిన*
*వెలుతురు అశ్వం-*
*మళ్లీ రక్తపు నురుగుల్తో*
*స్వప్నాల్ని బద్దలు చేస్తూ*
*అవతరిస్తుంది"-*

*"దుర్భమల్నీ, దుస్మృతుల్నీ*
*మనుగడను వంచించే మానసిక*
*మార్మికాల్నీ*
*పేర్చిన చితిపై కాలిమసై పోతున్న*
*అపురూప స్మృతినొక్కటి మాత్రం*
*మిగుల్చుకుంటాను"-*

రమణ కవిత్వానికి, కవితా పరిధులు దాటిన వున్నతికీ, జీవితాన్ని కాచి వడబోసిన అనుభవానికి ఉదాహరణగా మరొక్క కవితని చూడండి.

*"దుఃఖానికీ, దుఃఖానికీ మధ్య*
*విరామం ఆనందమే కాదు-*
*అబద్ధాన్ని నిజం నుంచి వేరు*
*వేయడం ఎవరి తరమూ కాదు*
*యెవరి స్వప్నాల మీద వారికి*
*శిలువలు ఖాయం, ఖాయం*
*బ్రతుకు అతివేదనా వ్రణం, రణం,*
*మారణం!"*

యవ్వనంలో చిత్తూరు జిల్లా రచయితల సంఘానికి పనిచేస్తున్నపుడు (1975-80) సాహితీసుధ లిఖిత మానసపత్రికను నడుపుతున్నపుడూ (1973-75) రమణ నాతో కలిసి పని చేశాడు. ఆ విషయాల్ని వినమ్రంగా 'రచయితను గురించిలో' వివరించాడు - గతాన్ని మరచిపోని అతని వున్నతికిది నిదర్శనం.

కవిత్వంలో పదాల పునశ్చరణ, కళేబరాలు, చితి, చితిమంటలు, శవాలు, సమాధులు, రక్తపు చుక్కలు వంటి పదాల్ని సాధ్యమైనంత వరకూ తక్కువగా వాడడం రమణకు హితవు. సంపుటికి 'ఇండెక్స్' లేకపోవడం కూడా పాఠకులకు నిరుత్సాహమే!

రమణ కవితా సుమ సురభిళాలతోనూ, భావ కవిత్వరోచస్సుల తోటి పయనిస్తూ, పయనిస్తూ మున్ముందు మరిన్ని కావ్యాల్ని అందించమని ఆహ్వానిస్తున్నాను.

## సినిమా

# ఆ 'లావులు' నాకు లేవు

ఈ మధ్య పలు హిందీ చిత్రాల షూటింగ్స్ హైదరాబాద్ లోని రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతున్నాయి. ఈ షూటింగ్‌లో పాల్గొనను వచ్చిన మాజీ విశ్వసుందరి ప్రియాంకచోప్రా దక్షిణాది ప్రేక్షకులపై తన మనసులో వున్న భావాలంటూ చెత్త మాటలు మాట్లాడింది. తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్ల యెద, నాభి, చివరికి నడిపోళ్లు సైతం సైజులు పెద్దవి కావాలి. అటువంటి

### ప్రియాంక బూతు బోధ

హీరోయిన్లనే లొట్టలేసుకొంటూ చూస్తారు. నాకు రెండు, మూడు చిత్రాల్లో అవకాశాలు వచ్చినా ఈ కారణాల వల్లే నటించలేదు. తెలుగు ప్రేక్షకులను నాబోటి వాళ్లు సం తృప్తి పర్చాలంటే బ్రాలో అవేవో పెట్టుకొని నటించాలని పగలబడి నవ్వుతూ చెప్పింది. విశ్వసుందరి నోట ఈ చెత్త వాగుడేమిటో?

### రెచ్చిపోయిన రైమాసేన్

మున్‌మున్‌సేన్ కుమార్తె రైమాసేన్ తెలుగు చిత్రాల్లో నటించను హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో బస చేస్తుంది. ఇటీవల తాగి హోటల్‌లో జరిగిన లేట్‌నైట్ పార్టీలో తన ఇద్దరు స్నేహితులతో కలిసి గందరగోళం సృష్టించింది. వేదిక మీద వుండే డ్యాన్సర్ జాకీ చేతిలోని మైకు లాక్కుంది. అంతటితో ఆగక బండ బూతులు తిట్టింది. రైమాసేన్ వీరంగానికి ఆ స్టార్ హోటల్ పబ్‌లోని కస్టమర్లు స్టన్ అయ్యారు. గందర గోళం చేసిన రైమాను స్టార్ హోటల్ యాజమాన్యం మరుసటి రోజు రూము ఖాళీ చేయించింది.

# మంచి పాత్రలివ్వండి

సంచలన చిత్రం గరల్‌ఫ్రెండ్‌లో స్వలింగ సంపర్కిగా నటించిన పాయల్ రోహిత్‌కు అన్నీ ఇటువంటి ఆఫర్లే వస్తున్నాయట. ఆ చిత్రాలు ఒప్పుకోలేక పెద్ద చిత్రాలు దక్కించుకోలేక ఆమె విలవిల్లాడుతున్నది. ఈ విషయమై మాట్లాడుతూ గరల్ ఫ్రెండ్ చిత్రంలో అసలు అలాంటి సీన్స్ తీస్తారని నాకు

### పాయల్ మొర

తెలీనే తెలీదు. ఇద్దరు అమ్మాయిల మధ్య అనురాగం అంటే ఏంటో అనుకొని ఓకే అన్నా... షాట్స్ బిట్స్, బిట్స్‌గా తీశారు. తీరా సినిమా చూశాక నాకే సిగ్గనిపించింది. ఈ పాడు ముద్ర పోగొట్టుకొంటాను. ఎవరైనా నిర్మాత మంచి పాత్రనిచ్చి పుణ్యం కట్టుకొంటే బాగుంటుందంటుంది. మరి పాయల్‌కు ఈ సహాయం చేసే నిర్మాత ఎవరు?



'అంజలి! ఐ లవ్ యూ'లో భగవాన్, మీరా వాసుదేవన్

# అదరహో! నేహా!!

తెలుగులో రాజశేఖర్ సరసన ఆయుధం చిత్రంలో నటించిన నేహాధూపియా, జాలీ చిత్రంలో ముద్దుల పందారం, అందాల కనువిందును ప్రేక్షకులు మర్చిపోలేరు. సినిమా షూటింగ్‌లో ఆమె ఉదారతతో యూనిట్ సభ్యులకు అన్నీ నిదురలేని రాత్రుళ్లే! సాధారణంగా పెద్ద హీరోయిన్లు హాట్ సీన్స్‌లో నటించే సమయంలో లైట్ బాయిస్‌ను బయటకు పంపేస్తారు. దర్శకుడు, కెమెరామెన్ మాత్రమే వుంటారు. అయితే నేహా మాత్రం ఇటువంటి సన్నివేశాల్లో నటిస్తూ అందరినీ వుండనివ్వమంటుంది. అదేమంటే ఇదంతా నటనేగా; ముఖానికి మేకప్ తుడిచేసుకొన్నట్లు షాట్ అయిపోగానే మనలో ఫీలింగ్స్ తుడిచేసుకుంటాం. రేపు బయట ప్రేక్షకులంతా తెరమీద చూడగా లేనిది వీళ్లు చూస్తే ఏం పోయిందనడంతో, యూనిట్ సభ్యులంతా ఈమె నటించే హాట్ సన్నివేశాలు ప్రత్యక్షంగా చూసే అదృష్టం దక్కించుకొన్నారు. అయితే నేహా చెప్పినట్లు వీటిని బుర్రలోంచి తీసి వెయ్యలేక యూనిట్ సభ్యులు నిదురలేని రాత్రుళ్లు గడుపుతున్నట్లు బాలీవుడ్‌లో కోడై కూస్తున్నారు.

### చెన్నై చేరిన రక్షిత

ఇడియట్, పెళ్లాం ఊరెళితే, శివమణి, ఆంధ్రావాలా చిత్రాల్లోని హీరోయిన్ రక్షిత బాగా లావై పోవడంతో ఆమెకు సినిమాల్లో అవకాశాలు ఒక్కసారి తగ్గిపోయాయి. దీంతో ఎటూ పాలుపోని ఈ కన్నడ తార బెంగుళూరు నుంచి చెన్నైకు రహస్యంగా షిఫ్ట్ అయ్యింది. ఇక్కడి ఒక ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో స్లిమ్‌నెస్ కోసం రహస్యంగా ట్రీట్‌మెంట్ తీసుకొంటుంది. బాడీ స్లిమ్ అయ్యి కొత్త గ్లామర్‌తో మళ్లీ కెమెరాల ముందుకు వస్తానని రక్షిత శపథం చేసినట్లు ఆమె సన్నిహితులు చెబుతున్నారు.

### పావుగంట కష్టం కోట్ల లాభం

కోట్ల రూపాయలు సంపాదించాలని అందరికీ వుంటుంది. కాని ఈ కల సాకారం కావడం సామాన్యులకు కష్టం. కానీ బాలీవుడ్‌లో ప్రముఖ తారలు కేవలం పావుగంట కష్టపడితే కోట్లు చేతుల్లో పడుతున్నాయి. సెక్సీ హీరోయిన్లు ఐటమ్ నంబర్ పేరుతో ఒక పాటలో పాల్గొని అందాలు ఆరబోసి లక్షలు తీసుకొంటున్నారు. ఈ దారిలోనే ప్రముఖ తారలు గెస్ట్ అప్పియరెన్స్‌కు ఓకె చేస్తూ కోట్లు పుచ్చుకొంటున్నారు. అమితాబ్ గెస్ట్ రోల్ ప్లే చేస్తే కోటి రూపాయ

తారువ 11వ పేజీలో

# నగ్నత్వమూ దైవత్వమే

సినిమాల్లో, సాంగ్స్ ఆల్బమ్స్‌లో అందాలు చూపితే గాని అవకాశాలురావు. కాని అందాలు ప్రదర్శిస్తుంటే రకరకాలుగా అడ్డుకొంటున్నారని బాలీవుడ్ హీరోయిన్ నెగర్‌ఖాన్ వాపోతుంది. 'పరాబ్ జోన పియే' వీడియో ఆల్బంలో కోర్టు సీనులో నిర్భీ అశ్లీలంగా నర్తించినందుకు ఢిల్లీ కోర్టు, నెగర్‌కు అక్షింతలు వేసింది. ఈ గొడవ సద్దుమణగక ముందే మరో

### నెగర్‌ఖాన్ నీచ సూక్తి

వీడియో ఆల్బంలో ఆమె దేహ ప్రదర్శన శృతిమించిందని కటింగ్స్‌పడ్డాయి. ఇన్ని వివాదాల్లో చిక్కినా నార్వే పత్రిక ఒక దానికి ఆమె నగ్నంగా ఫోజులివ్వడం సంచలనం సృష్టించింది. అయితే ఈ పత్రిక బాలీవుడ్‌లో కొందరికి రహస్యంగా చేరి చేతులు మారుతుండడం చర్చనీయాంశమయ్యింది. అందాలు శృతిమించి ఆరబోసి అవమానాలపాలు కావడం దేనికంటే; దేవుడిచ్చిన అందాల్ని చూపిస్తేతప్పేమిటని ఎదురు ప్రశ్నిస్తోంది.

### టైటానిక్ సుందరికి కొత్త అందం!

టైటానిక్ సుందరి కేట్ విన్‌స్లెట్ ఈ మధ్య షాపింగ్‌కు వెళ్లిందట. అక్కడ ఈమెను చూసిన అభిమానులు చాలా కొత్తగా కన్పిస్తున్నారే, ఇంతకూ మీరు కేట్‌విన్‌స్లెటేనా అని అడిగారట. తన అందంలో మార్పు రావడానికి కారణం ఈ మధ్యే తాను ఓ మగబిడ్డకు జన్మనివ్వడమేనని చెబుతోంది.

తారువ 11వ పేజీలో

# పవన్ కళ్యాణ్ సేద్యం

భారీ అంచనాలతో తీసిన గుడుంబా శంకర్ చిత్రం అనుకొన్నట్లు ఆడలేదు. దీనికి హీరో పవన్ కళ్యాణే కారణమంటున్నారు. నటనమాని దర్శకత్వంలో వేలు పెట్టడమే ఈ చిత్రం దెబ్బతినడానికి కారణమంటున్నారు. గతంలో పవన్ కళ్యాణ్ సినిమా పూర్తయిన తర్వాత తన తదుపరి చిత్రం

### తోటల్లోనే కాలక్షేపం

కోసం ఫైట్లు, డ్యాన్సులు నేర్చుకోవడంలో నిమగ్నమయ్యేవాడు. ప్రస్తుతం దీనికి భిన్నంగా గండిపేటలోని తన ఫామ్‌హౌస్‌లో కూరగాయలు, మొక్కలు పెంచడంలో ఎక్కువ సమయం గడుపుతున్నాడు. చేనుకు చేవ - రైతుకు రొక్కం నినాదం స్ఫూర్తితో స్వయంగా పాదులు చేసి నీళ్లు పెడుతూ, ఎరువులు

తారువ 11వ పేజీలో

# సిమ్రాన్ డబ్బు పిచ్చి

గ్లామర్ హీరోయిన్ సిమ్రాన్ ఓ ఢిల్లీ బాబును పెళ్లి చేసుకొని అక్కడే సెటిలైన విషయం పాఠకులకు విదితమే. ఇటీవల ఒక నిర్మాత సిమ్రాన్‌ను ఢిల్లీలో కలిసి తన చిత్రంలో నటించమని కోరాడట. దీనికి గాను ఆమె కోరిన పారితోషికం; కండిషన్స్‌కు హడలి పోయాడట. 50 లక్షలు పారితోషికం అడగడంతో పాటు సినిమా రెండు నెలల్లో పూర్తి కావాలని షరతు పెట్టిందట. డిమాండ్ వున్న రోజుల్లోనే యింత పారితోషికం తీసుకొన్నట్లు లేదే అంటే, నిజమే కావచ్చు కానీ ఇప్పుడు నాకు అవసరాలున్నాయి. యాక్టింగ్ కోసం నా పర్సనల్ లైఫ్‌ను త్యాగం చేయాలండట. ఈ మాటల వెనుక కారణాలు ఏమిటని అన్వేషించగా సిమ్రాన్ గర్భంతో వున్నట్లు తెలిసింది. అయినా వెతుక్కొంటూ వచ్చిన బేరాన్ని పోగొట్టుకోవడం దేనికి అనే దురాశతో ఈ విధంగా డిమాండ్ చేసినట్లు ఫిల్మ్ నగర్ వర్గాలు కోడై కూస్తున్నాయి.

# లేత మనసులు మహా ముదురు

వ్యక్తులుగా ఏ స్థాయికి ఎదిగినా మనసులు లేతగానే వుండాలి. చిగురాకుల్లా మధురానుభూతులు ఆ మనసుల్లో జీవించాలి. ముగ్గురు వ్యక్తుల మధ్య ఈ భావోద్వేగాలకు దృశ్య రూపం 'లేత మనసులు' చిత్రంలో చూపాలనుకున్నారు. దాన్ని ప్రభావశీలంగా తీర్చలేక పోయాడు దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి. కథను ఎన్నుకోవడంలో తెలివి తక్కువగా ప్రవర్తించినట్టు కథ చెప్తుంది. తెలుగులో మంచి కథలను తయారు చేసుకోలేక "అళగి" అనే తమిళ చిత్రం కథ మీద ఆధారపడ్డాడు. బోల్తా పడ్డాడు. ఒక అబ్బాయి, ఇద్దరు అమ్మాయిల మధ్య సాగే ప్రేమకథను ఉత్కృష్ట భరితంగా తెరకెక్కించాడు. తన పాత శైలిని భంగ పరిచాడు. కథ మామూలు మూసధోరణి కథ. ఈ బలహీనపు పాత కథకు తాను వ్రాసిన స్క్రీన్‌ప్లేతో కొత్తదనం తీసుకరాలేక పోయాడు దర్శకుడు.

రాజు(శ్రీకాంత్) ఒక సామాన్య కుటుంబం నుంచి ఎదిగిన వ్యక్తి. చదువుకునే రోజుల్లో ధనలక్ష్మి(కల్యాణి) అనే అమ్మాయిని ప్రేమించాడు. ఆమె అతన్ని ప్రేమిస్తుంది. పెళ్లి చేసుకోదలుస్తుంది. కాని రాజు ధైర్యం చేసి ముందడుగు వెయ్యలేక పోతాడు. దాంతో నిరాశ చెందిన ధనలక్ష్మి వేరొకరిని వివాహమాడి

**చిత్ర సమీక్ష**

**గ్రిద్దలూరు గోపాలరావు**

ఊరొదిలి వెళ్లిపోతుంది. చదువు పూర్తి చేసుకొని ఉద్యోగ ప్రయత్నంలో వున్న రాజు ఒక కంపెనీకి ఇంటర్వ్యూకు పోతాడు. ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ భాను (గోపిక) అతన్ని ప్రేమిస్తుంది. అతన్ని తమాషా పట్టించేందుకు ఉద్యోగం ఇస్తానంటూ చాలాసార్లు ఆఫీసు చుట్టూ తిప్పుకుంటుంది. చివరన ఉద్యోగం ఇస్తుంది. తన తల్లిదండ్రుల అంగీకారంతో రాజును వివాహం చేసుకునేందుకు సిద్ధమవుతుంది. ఆమెతో పెళ్లికి రాజు మొదట్లో కాస్త బెట్టు చేస్తాడు. ధనలక్ష్మితో తన చిన్ననాటి ప్రేమను తన మిత్రుడు అశోక్‌కి (శివాజీరాజా) చెప్పుకొని బాధ పడతాడు. ధనలక్ష్మి వేరొకరిని వివాహమాడి వెళ్లిపోవడంతో ఇక విధిలేక భానును వివాహం చేసుకుంటాడు రాజు. బంగారు కలలు కంటూ దాంపత్య జీవితం గడుపుతుంటాడు.

ఒక రోజు రోడ్డు మీద వెళ్తున్న రాజు, ధనలక్ష్మిని చూస్తాడు. ఆ సమయంలో ధనలక్ష్మి రోడ్డు ప్రమాదానికిగురై పడి వున్న తన కుమారుని వద్ద కూర్చొని విలపిస్తూ వుంటుంది. ఆర్థిక ఇబ్బందులకు గురై దీనావస్థలో వుంటుంది. ఆ స్థితిలో ధనలక్ష్మిని చూసిన రాజు జాలిపడి ఆమెను తన ఇంటికి తీసుకపోతాడు. భార్య అనుమతితో ధనలక్ష్మిని తన ఇంట్లో పని మనిషిగా వుంచుకుంటాడు. కొన్ని రోజులకు రాజు, ధనలక్ష్మిల

తారువ 11వ పేజీలో

# తల్లికానున్న రమ్య

నిన్నే పెళ్లాడుతా, ఖడ్గం, శ్రీఆంజనేయం చిత్రాల దర్శకుడు కృష్ణవంశీ, గ్లామర్ క్వీన్ రమ్యకృష్ణను పెళ్లి చేసుకొన్న విషయం పాఠకులకు విదితమే. ఇప్పటికీ సినిమాల్లో నటిస్తూనే వున్న రమ్యకృష్ణ, కృష్ణవంశీకి వరాంకురాన్ని ఇవ్వబోతుంది. శ్రీఆంజనేయం చిత్రం ఫ్లాప్ అయినా తండ్రి కాబోతున్నాననే ఆనందంలో కృష్ణవంశీ వున్నట్లు చెబుతున్నారు. గతంలో షూటింగ్ స్పాట్‌ల నుంచి ఫోన్ల ద్వారా మాట్లాడుకొనే దంపతులు, ఈ మధ్య ఎక్కడ చూసినా కలిసి కనపడుతున్నారు. ప్రస్తుతం అల్లుడు చిత్రంలో ఎన్టీఆర్‌కు అత్తగా నటిస్తున్న రమ్యకృష్ణ ఈ చిత్రం విడుదల అయ్యే సరికో, లేకుంటే శతదినోత్సవ సంబరమప్పటికో తల్లి కావడం ఖాయం.

బ్రాహ్మణ వివాహ సంబంధాలకు
సంప్రదించండి
ఫోన్: 0861 - 2316351

# వారఫలాలు

తేది 16-10-2004 నుండి 22-10-2004 వరకు మేషంలో రాహువు; తులలో కేతువు, రవి, బుధుడు; కన్యలో కుజుడు, గురువు; కర్కాటకంలో శని; సింహంలో శుక్రుడు; తుల, వృశ్చిక, ధనూ, మకర రాశులలో చంద్రుడు సంచరిస్తాడు.

## మేషం

(అశ్వని, భరణి, కృత్తిక 1పాదం)

ప్రణాళికా ఫలితాలు ఊహించని విధంగా తారుమారవుతాయి. ఆర్థికంగా ప్రతిష్టంభన కొనసాగుతుంది. ప్రయాణాలలోను, నూతన వ్యక్తుల పరిచయాలలోనూ ఆచితూచి వ్యవహరించడం అవసరం. స్థిరచరాస్తుల విషయాలు కొలిక్కి రావు. వైద్య పరంగా మానసిక ఆందోళన వుంటుంది. ఇతరుల విషయాలకు దూరంగా మెలగడం అవసరం. శుభకార్య ప్రయత్నాలలో జాప్యం వుంటుంది. విద్యా రంగంలోని వారికి, ఉద్యోగులకు అధిక శ్రమ వున్నా ఆశించిన ఫలితాలు నిదానం.

## వృషభం

(కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2పాదాలు)

ఆర్థిక ప్రణాళిక పట్ల నిరుత్సాహం తప్పదు. ఇతర ప్రణాళికల పట్ల వ్యతిరేక భావాలతో కూడిన పరిస్థితులుంటాయి. ముఖ్య ప్రణాళికలను గోప్యంగా అతి కష్టం మీద ప్రయత్నాలు ప్రారంభించిన ఫలిస్తాయి. సాహిత్య కళా రంగంలోని వారికి ఆశించిన ఫలితాలు నిదానం. విద్యా రంగంలోని వారికి, ఉద్యోగులకు ఆశించిన ఫలితాలుంటాయి. నూతన పరిచయాలు, భాగస్వామిక ఒప్పందాలలో కీలక పాత్ర పోషించినప్పటికీ ఫలితాలు నిదానం. స్థిరచరాస్తుల విషయాలలో ప్రతిష్టంభన వున్నా పురోభివృద్ధి వుంటుంది.

## మిథునం

(మృగశిర3,4పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు)

కార్యాచరణ ప్రణాళికలలో పురోభివృద్ధి వుంటుంది. ఆర్థిక వ్యవహారాలలో తొందరపాటు వల్ల అధిక ధన వ్యయ సూచనలు కలవు. ఇతరుల వల్ల మీ ప్రణాళికలు తప్పుదోవ పట్టే అవకాశం కలదు. వాగ్వివాదాలకు దూరంగా యుక్తితో మెలగితే లాభపడతారు. నూతన వ్యాపారాలు, ఒడంబడికల పట్ల పురోభివృద్ధి సాధిస్తారు. వాహన క్రయవిక్రయాలు, కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంగా ఆందోళన వుంటుంది.

## కర్కాటకం

(పునర్వసు 4పాదం, పుష్య, ఆశ్రేషలు)

ఉన్నత వ్యక్తుల సహకారంతో ప్రణాళికలలో పట్టు సాధిస్తారు. వ్యవహారాలలో ఆచితూచి వ్యవహరించడం అవసరం. కుటుంబ సభ్యుల వైద్య అవసరాలకు ధన వ్యయం వుంటుంది. ఉద్యోగులకు, విధి నిర్వహణలో ఆటంకాలుంటాయి. విద్యా రంగంలోని వారికి వారాంతంలో ఆశించిన ఫలితాలుంటాయి. పారిశ్రామిక, రియల్ ఎస్టేట్, గృహ నిర్మాణ రంగాలలోని వారికి సమస్యల పట్ల అశాంతి వుంటుంది. భాగస్వామిక ఒప్పందాలు, కుటుంబ సభ్యుల ఆస్తి వ్యవహారాలలో ఆశించిన ఫలితాలుంటాయి.

## సింహం

(మఖ, పుబ్బ, ఉత్తర 1వపాదం)

ప్రణాళికలను గోప్యంగా అమలు పరిస్తే లాభపడతారు. జాప్యమైన ముఖ్య ప్రణాళికలలో కుటుంబ సమస్యల వల్ల సమయానుకూలత పాటింపలేరు. ఉపాధి అవకాశాలలో అధిక ధన వ్యయం వల్ల ఫలితాలుంటాయి. గృహ మార్పులు, చేర్పులు, స్థిరచరాస్తుల విషయాలలో ఆశించిన ఫలితాలు నిదానం. కోర్టు వ్యవహారాలు, వాహన క్రయవిక్రయాలపై కొంత వరకు సంతృప్తి పొందుతారు. ఉద్యోగులకు, విద్యారంగంలోని వారికి విధి నిర్వహణలో ఆటంకాలున్నా సత్ఫలితాలవైపు పయనిస్తారు.

## కన్య

(ఉత్తర2,3,4పాదాలు, హస్త, చిత్త1,2పాదాలు)

వ్యక్తిగత వ్యవహారాలలోను, ఇతరుల వ్యవహారాలలోను మీ ఆలోచనా సరళికి గుర్తింపు లభిస్తుంది. దుష్ట సాంగత్యానికి దూరంగా మెలగితే ఆర్థికంగా పురోభివృద్ధి వుంటుంది. కుటుంబ సభ్యుల ఏకాభిప్రాయం లేక, స్థిరచరాస్తుల విషయాలపై దృష్టి కేంద్రీకరించలేరు. వాహన క్రయవిక్రయాలు, గృహ నిర్మాణ మార్పులు, చేర్పులలో పురోభివృద్ధి వుంటుంది. విద్యారంగంలోని వారికి, ఉద్యోగులకు మిశ్రమ ఫలితాలుంటాయి. నూతన వ్యాపారాదులకు, భవిష్యత్ ప్రణాళికలకు వారాంతంలో సత్ఫలితాలుంటాయి.

### పంచాంగం

అక్టోబరు తిథులు

ఆశ్వయుజ శుద్ధ

| | | | | |
|---|---|---|---|---|
| 16 | శని | తదియ | తెజా4.21గం.ల | వరకు |
| 17 | ఆది | చవితి | రా2.08గం.ల | వరకు |
| 18 | సోమ | పంచమి | రా11.49గం.ల | వరకు |
| 19 | మంగళ | షష్టి | రా9.21గం.ల | వరకు |
| 20 | బుధ | సప్తమి | రా7.28గం.ల | వరకు |
| 21 | గురు | అష్టమి | సా4.38గం.ల | వరకు |
| 22 | శుక్ర | నవమి | ప2.28 | వరకు |
| 23 | శనివారం | దశమి | ప 12.22గం.ల | వరకు |

నేలనూతల శ్రీనివాస మూర్తి

## తుల

(చిత్త3,4పాదాలు,స్వాతి, విశాఖ 1,2,3పాదాలు)

ఆర్థిక ప్రణాళికలలో తీవ్ర జాప్యం వుంటుంది. అకారణ కలహాలు, ఇతరుల ప్రేలాపనల వల్ల భవిష్యత్ ప్రణాళికల పట్ల నిరుత్సాహం వుంటుంది. ఆధ్యాత్మిక చింతన, దైవ కార్యక్రమాలలో పాల్గొనే అవకాశాలను సద్వినియోగం చేసుకోగలుగుతారు. విద్యా, సాహిత్య, కళా రంగాలలోనివారికి కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. ఉద్యోగ రంగంలోని వారికి ఆర్థికంగా చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. పిల్లల భవిష్యత్ ప్రణాళికలలో జాప్యం వుంటుంది. సుదూర వర్తమానాల పట్ల సానుకూల ఫలితాలుంటాయి.

## వృశ్చికం

(విశాఖ4పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

ఆర్థిక ప్రణాళికలలో జాప్యాన్ని సునాయాసంగా జయిస్తారు. తీవ్రంగా జాప్యమైన వ్యక్తిగత పనులను వున్నత వ్యక్తుల సహకారంతో పూర్తి చేస్తారు. రుణ విముక్తులయ్యేందుకు చేసే ప్రయత్నాలను గోప్యంగా అమలు పరచడం అవసరం. వాహన క్రయవిక్రయాలు, గృహ నిర్మాణ పనులు వాయిదా వేసుకోవడం మంచిది. వ్యాపార, విద్యా రంగాలలోని వారికి చిన్న చిన్న ఆటంకాలు మినహా పెద్ద సమస్యలుండవు. వాహన చోదకులకు జాగ్రత్త అవసరం. వాగ్వివాదాలకు, ఇతరుల విషయాలకు దూరంగా మెలగడం అవసరం.

## ధనస్సు

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పాదం)

ఆర్థిక ప్రణాళికలు ఫలించకపోయినా, కీర్తి ప్రతిష్టలకు భంగం వాటిల్లదు. శుభకార్య ప్రయత్నాలలో కొద్దిపాటి జాప్యం వుంటుంది. ఆడంబర ఖర్చులు పెరిగే సూచనలున్నాయి. ఉన్నత వ్యక్తుల వల్ల సానుకూల ఫలితాలున్నా సద్వినియోగంలో జాప్యం వుంటుంది. వ్యాపార, విద్య, ఉద్యోగ రంగాలలోని వారికి ప్రత్యర్థుల వల్ల ఆటంకాలుంటాయి. వాహన క్రయవిక్రయాలు, కోర్టు వ్యవహారాలలో అధిక శ్రమ వల్ల సత్ఫలితాలను పొందుతారు. పారిశ్రామిక, రియల్ ఎస్టేట్ రంగాలలోని వారికి స్వల్ప ఆటంకాలతో పురోభివృద్ధి వుంటుంది.

## మకరం

(ఉత్తరాషాఢ 2,3,4పాదాలు, శ్రవణం, ధనిష్ఠ1,2పాదాలు)

అధిక శ్రమ, మానసిక ఒత్తిళ్లలో ఆర్థిక ప్రణాళికలలో పురోభివృద్ధి సాధిస్తారు. కుటుంబ అవసరాల్లై ఊహించని విధంగా ధన వ్యయం వుంటుంది. స్థిర చరాస్తుల విషయంలో ఏకాభిప్రాయం సాధించలేరు. ఉపాధి అవకాశాల్లై చేసే ప్రయత్నాలు కొంత వరకు ఫలిస్తాయి. వాహన క్రయవిక్రయాలు మందకొడిగా సాగుతాయి. విద్యా, ఉద్యోగ రంగాలలోని వారికి ఆశించిన ఫలితాలు నిదానం. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఆధ్యాత్మిక దైవ కార్యక్రమాల పట్ల సంతృప్తిగా గడుపగలరు.

## కుంభం

(ధనిష్ఠ 3,4పాదాలు, శతభిష, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు)

ప్రణాళికల పట్ల జాప్యం వున్నా నిరుత్సాహ పడక పట్టుదలతో సాగిన పురోభివృద్ధి వుంటుంది. ఆర్థికంగా రాబడి కన్నా ఖర్చు శాతం అధికమవుతుంది. శుభకార్య ప్రయత్నాలలో పురోభివృద్ధి వుంటుంది. ఇనుము, సిమెంటు వ్యాపార రంగాలలోనివారికి స్వల్ప ఆటంకాలుంటాయి. ఆరోగ్య విషయంగా ధన వ్యయం వుంటుంది. వాహన క్రయవిక్రయాలు, కోర్టు వ్యవహారాలు, స్థిరచరాస్తుల విషయాలలో ప్రతిష్టంభన కొనసాగుతుంది. విద్య, ఉద్యోగ రంగాలలోని వారికి అధిక శ్రమ వల్ల ఆశించిన ఫలితాలుంటాయి.

## మీనం

(పూర్వాభాద్ర 4పాదం, ఉత్తరాభాద్ర, రేవతి)

జాప్యమైన ముఖ్య ప్రణాళికలను పురోభివృద్ధి వైపు తీసుకు పోగల్గుతారు. ఆకస్మిక ప్రయాణాల వల్ల లాభపడతారు. ఆర్థిక ప్రణాళికలకు అనుకూల సమయం. స్థిరచరాస్తుల విషయంలో ఏకాభిప్రాయ సాధన ప్రయత్నాలు ఫలిస్తాయి. కోర్టు వ్యవహారాలు, వాహన క్రయవిక్రయాలలో కొద్దిపాటి పురోభివృద్ధి వుంటుంది. విద్యా, ఉపాధి అవకాశాల రంగాలలోని వారికి సానుకూల ఫలితాలుంటాయి. ఇతరుల విషయాలలో తలదూర్చక మెలగడం అవసరం.

# జనవాణి

3వ పేజీ కొరవ

అలుముకొని వుండాయి. తాగునీటికి అల్లాడవలసిన విపత్కర పరిస్థితులు. ఈ దశలోనే మేఘమథనం ప్రారంభమయ్యింది. ఈ ప్రక్రియ తగిన ఫలితాలివ్వక పోయినా వరుణుడు కరుణించాడు. మొదట తెలంగాణా జిల్లాల్లో, ఆ తర్వాత రాయలసీమలో వర్షాలు పడ్డాయి. కర్నూల్ జిల్లా నాయకులు బలవంతంగా పోతిరెడ్డిపాడు తూములు ఎత్తివేసే సమయానికి ఆల్మట్టి పొంగి శ్రీశైలం నిండింది. అనంతపురం, కడపలోనూ వర్షాలు పడడంతో వాగులు, వంకలు రెండేళ్ల తర్వాత ప్రవహించాయి. ఈ జిల్లాల్లోని వరద నీటితోనే సోమశిలకు జలకళ వచ్చింది. వరంగల్‌లో కురిసిన వర్షంతో మంచినీటి సమస్య తీరింది. ఇదంతా ముఖ్యమంత్రి అదృష్టం కాక మరేమిటి?

హైదరాబాద్ ఎం.హరికృష్ణ

### మెకాలే విద్యా విధానం నుంచి బయట పడాలి

భారతీయులు మెకాలే విద్యా విధానం నుంచి బయట పడలేక పోతున్నారు. మెకాలే విద్యా విధానం వల్ల భారతీని, మత ధర్మాలను, వేష భాషలను మర్చిపోయారు. తెల్లవారి విద్యా విధానాన్నే తెలివైన విద్యగా నమ్ముతున్నారు. భారతీయ సంస్కృతిని పరిరక్షించే చర్యల్లో భాగంగా ప్రతి పాఠశాలలోనూ నిత్యం ఒక శ్లోకం, పద్యం, పంచాంగంలోని తిథి, వార నక్షత్రాలను విద్యార్థులతో నిర్బంధంగా చెప్పించేట్లు చేయాలి. ఆంగ్ల విద్యా వ్యామోహంలో మన ధర్మం, విలువలకు దూరమవుతున్నామని గ్రహించడం మంచిది.

కోవూరు కె.శ్రీహరి

# 50 ఏళ్ల క్రితం

3వ పేజీ కొరవ

నందం గారు 2మాసాలు సెలవు పెట్టారు. వారి స్థానే కంటాబత్తిన రామిరెడ్డి ఎం.ఎస్.సి. గారు తాత్కాలిక ప్రిన్సిపాల్‌గా వుంటారు. రామిరెడ్డి గారు విజ్ఞానులు, సజ్జనులు, యోగి సదృశ్యులు. తన పని తప్ప ఇతరయే గొడవల్లోకి తలదూర్చే తత్వం కాదు. నలుగుర్ని చేరదీసుకోవడం ఒక్కటే కావలసింది. బాధ్యత నెత్తిన బడ్డప్పుడు అది స్వభా

నమస్సులు.

కావలి ప్రిన్సిపాల్ విషయం ఇంకా తేలలేదు.

### అన్సారీ సాహెబు

మన పబ్లిక్ ప్రాసిక్యూటర్ అన్సారీ సాహెబ్ గారిని, తిరుపతి వేంకటేశ్వర కాలేజి విద్యా కమిటీ సభ్యుడుగా, ఆంధ్ర యూనివర్సిటీ సెనేట్ నియమించింది. అన్సారీ గారు సౌజన్యుడు, స్థానిక ముస్లిం నాయకత్వంలో పర్‌ఫెక్ట్ జెంటిల్‌మెన్‌గా ప్రవర్తిస్తున్నాడు. పీర్ల గుండంలోని మతనిప్పు రవ్వలు యెగరకుండా చల్లార్పుతున్న వ్యక్తి. ఈ సంవత్సరం దసరాలో హిందువులు యెప్పుడు వేయనన్ని పులివేషాలు వేసి ముస్లిముల మధ్య యెగురుతున్నా, ఋషుల ఆశ్రమాల్లో పులులు, మేకలు మమేకంగా సాధుత్వం అవలంభించినట్లు ఆనంధరూపములో నడిచింది. ప్రతిభావంతుడనుకొన్న యాహ్యాలి హయాంలో చూడనంత సౌమనస్యం చూచాం అన్సారీ సాహెబ్ హయాములో - సలాం భాయ్!

### అవి - ఇవి

### వాకాటి పీరారెడ్డి సత్రం

కమిటీ వారు ఈనెల 16తేది మద్రాసు సత్రంలోనే సమావేశమై ప్రారం

కమిటీ ఏర్పడి 5 సం.లైంది. కొత్త ఎన్నికలు గూడా జరుగవలసి వుంటుందేమో?

***

ఈ రోజు నెల్లూరులో వర్ష ముఖమైంది. చినుకులు పడుతున్నవి.

### నెల్లూరు సినిమాలు

| | |
|---|---|
| వినాయక - | ఇద్దరు పెళ్లాలు |
| శేషమహల్ - | జాతకఫలం |
| వెంకటేశ్వర - | మా గోపి |
| కొత్తహాలు - | ప్రజారాజ్యం |
| మణిటాకీస్ | -బ్రహ్మచారి పెళ్లి ప్రయత్నం -విమర్శకుడు |

### నెల్లూరు మునిసిపల్ పాలన

నెల్లూరు మునిసిపాలిటీకి సంబంధించి 1953-54 పరిపాలనా నివేదిక ప్రకటింపబడింది. అందులోని కొన్ని అంశాలు దిగువ యిస్తున్నాము.

### జనాభా, కౌన్సిలు

నెల్లూరు జనాభా 1951 లెక్కలననుసరించి 81,467. కాని అది యిప్పుడు లక్షకు పెరిగిందని మునిసిపాలిటీ అంచనా. టవున్ 28 వార్డులుగా విభజించబడింది. అందులో 28 సాధారణ స్థానాలు, 2 వెనుకబడిన జాతులు, 2 స్త్రీల ప్రత్యేక స్థానాలు, మొత్తం 32 ఆరు మంది ముస్లింలు, వెనుకబడిన జాతుల వారు ముగ్గురు, స్త్రీలు ముగ్గురూ వున్నారు. అంటే సాధారణ స్థానంలో ఒక స్త్రీ (మిస్ మేరీ నాయుడు) ఎన్నికయినదన్నమాట.

ఈ సంవత్సరంలో 19 సార్లు కౌన్సిల్ సమావేశమైంది. 708 విషయాలు కౌన్సిల్ ముందు ప్రవేశ పెట్టబడగా, 5మాత్రం అపరిష్కృతంగా నిల్చిపొయ్యాయి.

కమీషనరుకు, మునిసిపల్ ఆఫీసు సిబ్బంది జీతాల క్రింద 37,787 రూపాయలు ఖర్చయింది. ఈ పద్దు క్రింద గత సంవత్సరం కంటె 5160 రూపాయలు పెరిగింది. దీనికి కారణం మునిసిపాలిటీ హోదా పెరగడమే. కలెక్షన్ సిబ్బంది మీద 16,724 రూపాయలు ఖర్చయింది. ఛైర్మన్ ఏ.సి.సుబ్బారెడ్డి గారు కారు అలవెన్సు క్రింద నెలకు 75 రూపాయలు మాత్రం తీసుకుంటారు.

జమీన్‌రైతు
వెంకటరమణ విలాస్ మిద్దెపై, పొగతోట, నెల్లూరు. ఫోన్: 2327354
చందా
సంవత్సరానికి రూ.150లు
విదేశాలకు రూ.850లు
చందా ఎం.ఓ./డి.డి. ద్వారా మాత్రమే

## ఆరోగ్య దొర

4వ పేజీ తరువాయి

కారి చూడాల్సి రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలచి పోయే ప్రమాదం ఏర్పడింది. ఇరిగేషన్ ఎస్ఇ త్రిపురేశ్వర రావు తన బాధ్యతలకు తోడుగా తెలుగు గంగ, సోమశిల ప్రాజెక్టుల ఇన్‌ఛార్జి ఎస్ఇగా త్రిపాత్రాభినయం చేస్తున్నారు. కొత్తగా ప్రభుత్వం ఏర్పడ్డాక ఇరిగేషన్ శాఖలో కొన్ని పనులు మంజూరయ్యాయి. ఈ పనుల ప్రగతి, ఎస్ఇ ఎప్పటికప్పుడు చూడాలి. సోమశిల ప్రాజెక్టులో 21 టిఎంసిల నీళ్లు చేరుకొన్నాయి. ఇప్పటి వరకు ఐడిబి సమావేశానికి ఏర్పాట్లు పూర్తి కాలేదు. నారుమళ్లకు నీటికోసం రైతులు ఎదురు చూస్తున్నారు. తెలుగు గంగ నీటిని చెన్నై పంపుతామని ముఖ్య మంత్రి వాగ్దానం చేశారు. ముఖ్యమైన మూడు శాఖల పనిలో ఏది ముందు, ఏది వెనుకాల చేయాలో తెలియక ఎస్ఇ గందరగోళ పడుతున్నారు. ఇరిగేషన్ శాఖలో ఎఇ, డిఇ, ఇఇ పోస్టులు ఖాళీగా వుండడంతో ప్రస్తుతం జరుగుతున్న పనులను చూసేవారే లేకుండాపోయారు. ప్రభుత్వం ప్రమోషన్లు ఇవ్వక పోవడంతో ఎస్ఇల కొరతతో వున్న అధికారులు ద్విపాత్ర, త్రిపాత్రాభినయాలు చేయాల్సి వస్తుంది. జిల్లాలో ఎంతో ముఖ్యమైన తెలుగుగంగ, సోమశిల ప్రాజెక్టులకు తక్షణం ఎస్ఇలు నియమించేలా ప్రజా ప్రతినిధులు ప్రభుత్వంపై వత్తిడి తీసుకో రావాల్సి వుంది.


### కార్పొరేట్ బీమా సంస్థలతో గందరగోళం

కార్పొరేట్ బీమా సంస్థల మధ్య ఏర్పడిన పోటీ మూలంగా గ్రామాల్లో

హోటళ్లలో రెండు రోజులు గడిపే వీలు కల్పిస్తున్నారు. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌కు పోటీగా నడుస్తున్న ఈ పథకాల్లో ఎన్నింటికి నిజమైన గుర్తింపు వుందో తెలియదు కాని స్థానికుల నమ్మకం మీద మాత్రం ఇవి నడిచి పోతున్నాయి. గుర్తింపు, డబ్బుకు పూర్తి భద్రత వున్న బీమా సంస్థల వివరాలు ఐఆర్‌డిఎ ప్రకటిస్తే బాగుంటుందేమో?

### రైలు పట్టాల ప్రక్కన జట్రోపా మొక్కలు

జిల్లా గుండా సాగే రైలు మార్గం ప్రక్కనున్న రైల్వేశాఖకు చెందిన స్థలాల్లో జట్రోపా మొక్కలను వేసి పెంచాలని ఆ శాఖాధికారులు నిర్ణయించారు. రైలు ఇంజన్లకు డీజిల్ బదులు బయో డీజల్ వాడాలని రైల్వేశాఖ ఒక ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ డీజిల్‌ను ఉత్పత్తి చేయను జట్రోపా మొక్కలు ఎంతగానో ఉపయోగపడుతున్న దృష్ట్యా ఈ నిర్ణయాన్ని తీసుకొంది. రైలు పట్టాలకు ఇరువైపుల జట్రోపా మొక్కలు పెంచి పోషించే బాధ్యతలు స్టేషన్ మాస్టర్లకు అప్పగించనున్నారు. దీనికి అవసరమైన విత్తనాలు కూడా స్టేషన్ మాస్టర్లకు అందనున్నాయి. ఇప్పటికే రైల్వేశాఖ రైలు పట్టాల ప్రక్కన పచ్చదనం కోసం వివిధ రకాల మొక్కలను నాటి వుంది. జట్రోపా బయోడీజిల్‌కే గాక ఔషధ పరిశ్రమల్లోనూ ఉపయోగపడే అవకాశం వుండడంతో రైల్వేశాఖకు ఈ పెంపకం లాభాలార్జి పెడుతుందని ఆ శాఖాధికారులు తల పోస్తున్నారు. ఈ శాఖకు సంబంధించిన మిగతా అన్ని ఖాళీ స్థలాల్లోనూ జట్రోపా



నెల్లూరులో రాష్ట్ర మహిళా క్రీడోత్సవాలను పురస్కరించుకొని మహిళా క్రీడాకారులకు ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బి.రాజశేఖర్, జాయింట్ కలెక్టర్ శ్రీధర్ తదితరులు.

అవాంఛనీయ పోటీ పరిస్థితులు నెలకొని వున్నాయి. కార్పొరేట్ బీమా సంస్థలు, మనీ సర్క్యులేషన్‌ను పోలిన విధంగా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి. 2002 సంవత్సరంలో ఇన్స్యూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఐఆర్‌డిఎ) ఏర్పాటైన అనంతరం 13 ప్రైవేటు సంస్థలు బీమా రంగంలో అడుగిడాయి. ఈ సంస్థలు కార్పొరేట్ ఏజంట్ల నియామకం చేశాయి. పోటీల మధ్య కేంద్రీకరణతో ఢిల్లీ, కలకత్తాల్లోని కార్పొరేట్ ఏజంట్లకు సహాయకారులుగా స్థానికంగా కొందరు జతయ్యారు. ప్రైవేటు బీమా సంస్థల్లో పాలసీ చేసిన వ్యక్తి మరో ఐదుగురు పాలసీదారులను చేర్పిస్తే ఆకర్షణీయమైన బహుమతినిస్తున్నారు. 13 దశలలో సాగుతున్న ఈ బహుమతుల పరంపరలో హీరోహోండా, మారుతి

మొక్కలను పెంచాలని ఉన్నతాధికారులు ఆదేశాలివ్వడంతో స్థలాల చదును, కొత్త స్థలాల అన్వేషణలో రైల్వేశాఖాధికారులు బిజీగా వున్నారు.

## అక్రమ బియ్యం

4వ పేజీ తరువాయి

గజలక్ష్మి, 19తేది కాళికా, 20తేది సరస్వతి, 21తేది దుర్గా, 22తేది మహిషాసుర మర్దని, 23తేది రాజరాజేశ్వరి అలంకారాలు చేస్తారు. విజయదశమి నాడు అమ్మవారి నగరోత్సవం జరుగుతుంది. ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతి నిత్యం సామూహిక నిత్య నవావరణ పూజ, నవచండీ హోమం, మహాభిషేకం, లలితా సహస్రనామ పారాయణం జరుగుతుంది. రాత్రి ఏడు గంటల నుంచి 24తేది అన్నదానం కూడా నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ ఎం.సుబ్రహ్మణ్యం రాజు చెప్పారు. భక్తులను ఈ కార్యక్రమాలకు తరలి రమ్మంటున్నారు ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు రత్నం జయరాం.

## భోజన పథకం

4వ పేజీ తరువాయి

పిల్లలుండగా 42 మందికి భోజనం వండినట్లు రిజిష్టర్‌లో వ్రాసి వుండగా ఈ వ్యవహారం చూసే ఉపాధ్యాయునికి మెమో ఇచ్చారు. నెల్లూరు రూరల్ మండలంలో జరుగుతున్న ఈ కుంభకోణంపై విజిలెన్స్ శాఖ కూడా దృష్టి కేంద్రీకరించి వుంది.

## పెద్దాస్పత్రి

4వ పేజీ తరువాయి

చికిత్స చేయాల్సిన వైద్యాలయంలో ఈ నకిలీ సర్టిఫికేట్ల తయారీని అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## డీలర్ల దోపిడీ

5వ పేజీ తరువాయి

నరహరి కుమారుడు శ్రావణ్‌కుమార్ జలదంకి రోడ్డులో మోటార్ సైకిల్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడితే ఆర్టీసి వారు ఈ వైద్యశాలకు చేర్చారు. వైద్యులు సకాలంలో స్పందించక పోవడం, నెల్లూరుకు తీసుకొస్తుండగా అతను మరణించడం ఆ కుటుంబీకులను కలచి వేసింది. ఈ నెల 11తేది జలదంకి మార్గంలో ఆర్టీసి బస్సు, ఆటో ఢీకొని నల్గురు చనిపోగా ఆటో డ్రైవరు జేమ్స్, మరొక మహిళ తిరుపతమ్మను ఈ వైద్యశాలకు తీసుకు రాగా సరైన చికిత్స లేకపోవడంతో జేమ్స్‌ను నెల్లూరు తరలిస్తుండగా మరణించాడు. తిరుపతమ్మను కూడా నెల్లూరు చేర్చారు. మొత్తం మీద ఈ వైద్యశాలలో వైద్యం సక్రమంగా అందేలా జిల్లా కలెక్టరు దృష్టి పెట్టాల్సిన అవసరం వుంది.

### నిర్లక్ష్యపు నీడలో ప్రభుత్వ భవనాలు

ప్రజల నుంచి వివిధ పన్నుల రూపేణా ప్రభుత్వ ఖజానాకు చేరిన ధనం కొందరి అధికారుల అవగాహన లోపం, ముందు చూపు కొరవడడం కారణంగా నిరర్థకమయ్యింది. సంగంలో ఎటువంటి నిర్దిష్ట ప్రణాళిక లేకుండా నిర్మించిన భవనాలవల్ల ప్రభుత్వ నిధులు భారీగానే దుర్వినియోగమయ్యాయి. ఐదేళ్ల క్రితం పోలీస్‌స్టేషన్ వెనుక నిర్మించిన ట్రెజరీ కార్యాలయం ఎందుకు కొరగాకుండా వుంది. 6లక్షలకు పైగా ఖర్చు చేసి అప్పట్లో దీనిని నిర్మించారు. కొరవ పనులు ఇంకా పూర్తి కావలసి వున్నప్పటికీ తదుపరి పట్టించుకొనే వారే లేకపోవడంతో తలుపులు చోరీకి గురయ్యాయి. రాళ్లచెలిక గిరిజనుల కాలనీలో అసంపూర్ణంగా నిర్మితమైన కమ్యూనిటీ హాలు గిరిజనుల అవసరాలకు గాక పేకాట రాయుళ్లకు అడ్డాగా మారింది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అనాలోచితంగా చేపట్టిన ట్రెజరీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు సంవత్సరాల తరబడి ప్రారంభానికి నోచుకోక మరుగున పడివున్నాయి. సంగం వారధి అవతల ఇరిగేషన్ సిబ్బందికి నిర్మించిన క్వార్టర్స్ మందుబాబులకు చీకటి కార్యకలాపాలకు నిలయంగా మారాయి. చెక్‌పోస్టు సమీ



నెల్లూరు వెంకటరెడ్డినగర్‌లోని మురికి వాడలను పరిశీలిస్తున్న రాపూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి.

నిర్మించి తారుట్యాంకు నిరుపయోగంగా వుంది. దీని చుట్టూ వున్న ఖరీదైన అల్యూమినియం షీట్ దొంగలపాలైంది. ప్రక్కనే ఆర్‌అండ్‌బి సెక్షన్ ఆఫీసుకు గత కొన్ని సంవత్సరాలుగా తాళం వేసి వున్నారు. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు ప్రజావసరాలకు ఏ మాత్రం పనికి రాకుండా పోయాయి. సంగంలో అభివృద్ధికి మంజూరైన నిధులను సక్రమంగా సద్వినియోగం చేసుకోలేదనడానికి ఈ భవనాలే ప్రత్యక్ష సాక్ష్యాలు. కేవలం కాంట్రాక్టర్లకు పనులు కల్పించడం కోసమే వీటిని నిర్మించారా? అన్న సందేహం కల్గుతోంది. ఒకవైపు ప్రభుత్వ ధనం ఖర్చై వివిధ భవనాల రూపంలో వృథాగా పడివుంటే మరోవైపు వీటికి కనీసం రక్షణ కూడా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి, బాధ్యతా రాహిత్యానికి అద్దం పడుతోంది.

### జనార్దనరెడ్డి కోరికను రాజ్యలక్ష్మమ్మ నెరవేర్చారు

వెంకటగిరి మేజర్ పంచాయతీని మునిసిపాలిటీ చేయను రంగం సిద్ధమయ్యింది. వెంకటగిరిని మునిసిపాలిటీ చేయాలన్న కోరిక మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి గారిది. ఆయన కోరికను ఇప్పటి వెంకటగిరి ఎమ్మెల్యే, చదువుల మంత్రి రాజ్యలక్ష్మమ్మ నెరవేర్చనున్నారు. వెంకటగిరి మునిసిపాలిటీలో చుట్టు ప్రక్కల గ్రామాలు మునులాలపేట, అమ్మవారిపేట, బెవిరెడ్డిపల్లి, పెరియవరం, బంగారుపేట కలవనున్నాయి. సోమసానిపేటను కలపాలా లేదా అనే విషయమై చర్చ కొనసాగుతుంది. వెంకటగిరి పట్టణ విస్తీర్ణం 2,246 హెక్టార్లు. ఆదాయ వనరులు 60 లక్షల రూపాయలు. కొన్ని గ్రామాల సర్పంచులను మునిసిపాలిటీకి అనుకూలంగా తీర్మానం ఇవ్వవద్దని రాజాలు వత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. ఇటువంటి పంచాయతీల పాలక వర్గాలను ప్రభుత్వం రద్దు చేయక తప్పదేమో?

## నేహా

9వ పేజీ తరువాయి

లివ్వాలి. షారూఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్ అయితే కోటిన్నర. సన్నీడియోల్ 50 లక్షలు, సునీల్‌షెట్టి 15-20 లక్షల మధ్య, ఐశ్వర్య, మాధురీదీక్షిత్‌లు 50 లక్షలు, ఊర్మిళ, బిపాసబసు 10 లక్షలు తీసుకొంటున్నారు.

## దైవత్వమే

9వ పేజీ తరువాయి

ఆడదానిలో అందం పెళ్లికాగానే ఓ విధంగా వుంటుంది. పిల్లల తల్లి కాగానే

కొద్ది మునుపటి కంటే అందంగా కన్పిస్తున్నానని అంటున్నారు. మళ్లీ నాజూగ్గా తయారు కావడానికి అన్ని పనులు నేనే చేసుకుంటున్నాను. చివరకు మా బాబు ఆలనా పాలనా చూసేందుకు ఆయాను కూడా నియమించలేదు తెలుసా అంటూ గారాలు పోతోంది.

## పవన్ కళ్యాణ్

9వ పేజీ తరువాయి

చల్లుతూ, తీగపాదులకు పందిళ్లు వేస్తూ బిజీగా వున్నాడు. పవన్ కళ్యాణ్ పచ్చి కూరగాయల ముక్కల్ని ముఖ్య ఆహారంగా తీసుకొంటాడట. ఈ ఇష్టమే కూరగాయల పెంపకం పట్ల ఇష్టం కల్గించిందేమో!

## చిత్రసమీక్ష


9వ పేజీ తరువాయి

ప్రేమ వ్యవహారం భాను తెలుసుకుంటుంది. ఇక అక్కడి నుంచి రాజు, భానుల మధ్య గొడవలు ప్రారంభమవుతాయి. రాజు దాంపత్య జీవితం బాగుండాలన్న భావనతో ఎవ్వరికీ చెప్పకుండా ధనలక్ష్మి ఇంట్లోంచి వెళ్లిపోతుంది.

కథ చాలా అస్తవ్యస్తంగా వుంది. అంతా పాతవాసనే. ముక్కోణపు ప్రేమకథను చూపిన విధానం పేలవంగా వుంది. ఇందులోని సన్నివేశాలు ఏ విధంగానూ ఆకట్టుకోవు. ముఖ్యంగా రాజు, ధనలక్ష్మిని ప్రేమించిన విధానాన్ని ఫ్లాష్ బ్యాక్‌లో చెప్పిన తీరు సాగదియ్యటంతో విసుగెత్తుతుంది. మొత్తం మీద లేతమనసులు చిత్రం రోతగా వుంది. ముక్కోణపు ప్రేమ అనేది ఈనాడు పెద్ద సమస్య కాదు. అలాంటి నిరర్థకమైన చిత్రాన్ని నిర్మించి, తెనాలి ఎమ్పీ బాలశౌరి, బాపట్ల మాజీ ఎమ్మెల్యే అనంతవర్మ చేతులు కాల్చుకున్నారు.

రాజు, భాను, ధనలక్ష్మి పాత్రలు షరా మామూలు గానే మూస ధోరణిలో సాగాయి. ఆ పాత్రల్లో శ్రీకాంత్, గోపిక, కల్యాణిల నటన అంతంత మాత్రంగానే వుంది. చింతపల్లి రమణ మాటలు, కీరవాణి సంగీతం కొంత పర్వాలేదు. పాత కథకు కొత్తదనం చూపడంలో దర్శకుడు విఫలమైనాడు.

అన్నీ ప్రముఖ కంపెనీల మందులు లభించును
వివేకా మెడికల్స్
పొగతోట, నెల్లూరు
ఫోన్: 2327691




ji Ads. 2327721